Bhavani Publication Trust
https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన
ప్రజా టెలివిజన్
యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622
ప్రజా TV
PRAJA TELEVISION
The People's Favour
మా యూట్యూబ్ చానల్‌ను
సపోర్ట్ చేయండి
8309979541
ప్రజా టెలివిజన్
తాజా వార్తలు, అప్‌డేట్,
లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 | సంచిక : 301 | హైదరాబాద్ | బుధవారం 16 సెప్టెంబరు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR




# యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు

**ఉచిత లావాదేవీల విధానానికి కేంద్రం చెల్లుచీటీ..**

**వ్యాపారులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధింపు**

- వ్యక్తుల నుంచి వ్యాపారులకు రూ. 2 వేలకుపైగా యూపీఐ చెల్లింపులపై 0.4 శాతం చార్జీ
- రూ. 75 వేలు మించిన యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ గరిష్టంగా రూ. 300గా ఖరారు
- రైల్వే, టెలికం, బీమా, ఇంధన రంగాలకు రూ. 2 వేలకుపైగా జరిపే చెల్లింపులపై రూ. 5 చార్జీ
- వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ లావాదేవీలు, చిరు వ్యాపారులకు మాత్రం ఉచితం

-2లో



# బీఆర్ఎస్ గేమ్ స్టార్ట్!

## రంగంలోకి మాజీ సీఎం కేసీఆర్

- పదేళ్ల పాలనే అస్త్రంగా ప్రజల్లోకి..
- పాదయాత్రతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్
- 22ఏ వంటి కీలక అంశాలతో హరీశ్
- మూడు సూత్రాలతో గులాబీ ప్లాన్
- రానున్న రోజుల్లో రణరంగమే..
- పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు

తెలంగాణ కోసం పోరాటం చేసి, తెలంగాణ ఆవిర్భావం తర్వాత పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ మళ్లీ పూర్వవైభవం దిశగా సరికొత్త వ్యూహంతో జనంలోకి రానుంది. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత బయట పెద్దగా కనిపించని గులాబీ బాస్ ఎన్నికలకు రెండేళ్ల సమయం ఉండగానే మళ్లీ జనంలోకి రావాలని భావిస్తున్నారు.

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

ఆయన ఫాంహౌస్‌కే పరిమితమైనట్లు సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తుండగా, ఫాంహౌస్‌లో ఉన్న కేసీఆర్ సరికొత్త వ్యూహాలకు పదును పెడుతున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల చోటు చేసుకున్న పరిణామాలు.. ఫాంహౌస్ వద్ద కాంగ్రెస్ చేసిన యాగీ నేపథ్యంలో మాజీ సీఎం కేసీఆర్ రాజకీయాల్లో మళ్లీ క్రియాశీలకంగా మారేందుకు ఇదే సరైన సమయం అని భావిస్తున్నట్లు సమాచారం..

**కేసీఆర్ చేతిలో బ్రహ్మాస్త్రం**

పదేళ్లు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రస్తుత పరిస్థితుల్లో కొత్త అస్త్రం అవసరం లేదు. ఆయన చేసిన అభివృద్ధే బ్రహ్మాస్త్రం అనేది నిర్వివాదాశం. సాగునీరు, ప్రాజెక్టులు, ఉచిత విద్యుత్, రైతుబంధు, సంక్షేమ పథకాలను తన పాలనకు ప్రధాన గుర్తులుగా చూపించగల ఆయన.. ప్రజల్లోకి వస్తే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో పోలిక పెట్టే అవకాశం ఉంది. అయితే పదేళ్ల పాలన ఆయనకు బలమే కాదు.. ప్రత్యర్థులకు విమర్శల

-2వ పేజీలో



# ఈ ప్రాంతాన్ని ఉస్మానిస్థాన్‌గా మార్చాలనుకున్న నిజాం

**మజ్లిస్‌కు భయపడే విమోచనదినం నిర్వహించడం లేదు: రామచందర్‌రావు**

**అమరవీరులకు నివాళి అందరి బాధ్యత: కిషన్‌రెడ్డి**

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ప్రజాతీర్పు)

ఓటుబ్యాంకు రాజకీయాలతోనే ప్రస్తుత కాంగ్రెస్, గతంలో భారాస ప్రభుత్వాలు సెప్టెంబరు 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించడం లేదని భాజపా అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఆరోపించారు. రెండు పార్టీలు ఎంఐఎంకు భయపడుతున్నాయని విమర్శించారు. భాజపా మహిళా మోర్చా ఆధ్వర్యంలో మహిళా శక్తి ర్యాలీని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం నుంచి అసెంబ్లీ వద్ద ఉన్న సర్దార్ పటేల్ విగ్రహం వరకు నిర్వహించారు. ఈ ర్యాలీని రామచందర్‌రావు, కేంద్రమంత్రి

-2వ పేజీలో

# వీసా గడువుపై నియంత్రణకు కోర్టు బ్రేకులు

**ఆర్థిక, ఉన్నత విద్యావ్యవస్థలకు నష్టం**

- దుర్వినియోగమయ్యే అవకాశాలు ఉన్నాయి
- విద్యాసంస్థలపై పట్టుకు ప్రభుత్వ ప్రయత్నమా?
- న్యాయమూర్తి వ్యాఖ్యలు



వాషింగ్టన్, సెప్టెంబరు 15

విదేశీ విద్యార్థులు, జర్నలిస్టులు అమెరికాలో ఉండే సమయాన్ని నియంత్రిస్తూ ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనకు ఫెడరల్ కోర్టు బ్రేక్ వేసింది. మరో రోజులో అమల్లోకి రావాల్సిన ఈ నిబంధన అమెరికా ఆర్థిక, ఉన్నత విద్యా వ్యవస్థలకు భారీ నష్టం చేకూర్చేదని మసాచూసెట్స్ డిస్ట్రిక్ట్ న్యాయమూర్తి సోమవారం వ్యాఖ్యానించారు. దేశ రక్షణ కోసం ఈ నిబంధన అవసరమన్న ప్రభుత్వ వాదనను తోసిపుచ్చారు. భారత్‌సహా అమెరికాలో ఉంటున్న వేలాది మంది విదేశీ విద్యార్థులకు ఈ నిర్ణయం ఎంతో ఊరటనిచ్చేది అనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ట్రంప్ ప్రభుత్వం ఈ ఏడాది జూలై నెలలో తీసుకొచ్చిన కొత్త నిబంధన ప్రకారం విద్యార్థులు, ఎక్స్ఛేంజ్

-2వ పేజీలో

# పోలీస్ స్టేషన్లలోనే గూండాల రాజ్యమా?!




**కేసీఆర్ ఇంటిపై దాడికి తెగబడ్డారు.. మాపైనా ఉసిగొల్పారు**

- ఠాణాలోనే నా పీఏ, పీఆర్‌వోలపై 15 మందితో దాడులు చేయిస్తారా?
- ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయని దౌర్భాగ్యం
- కాంగ్రెస్ కార్యకర్తల్లా మారిన పోలీసులు.. న్యాయస్థానాలను ఆశ్రయిస్తాం
- వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సర్కారు కుట్రలు
- ఢిల్లీ వేదికగా రేవంత్ సర్కారు అరాచకాలపై భగ్గుమన్న కేటీఆర్

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని, పోలీస్ స్టేషన్లలోనే దాడులకు తెగబడే స్థాయికి కాంగ్రెస్ అరాచక పాలన చేరిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

-2లో

# హైదరాబాద్ రవాణా వ్యవస్థ విస్తరణకు సమగ్ర ప్రణాళిక

**నగరానికి నలువైపులా బస్ టెర్మినల్స్**


- గాజులరామారం, శంషాబాద్, ఎల్బీనగర్, ఘట్కేసర్ ప్రాంతాల్లో ఏర్పాటు
- అంతర్‌జిల్లా, అంతర్రాష్ట్ర బస్సులు నగర శివార్లలోనే
- లాస్ట్ మైల్ కనెక్టివిటీ ద్వారా మెట్రో, ఎంఎంటీఎస్, సిటీ బస్సులతో ప్రయాణికులకు అనుసంధానం
- నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్, కాలుష్యాన్ని తగ్గించడమే లక్ష్యం: మంత్రి పొన్నం



(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)

హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, వాహన కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ నగరానికి నలువైపులా ఆధునిక బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. గాజులరామారం, శంషాబాద్, ఎల్బీనగర్, ఘట్కేసర్ ప్రాంతాల్లో బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు వైపు నుంచి హైదరాబాద్‌లోకి వచ్చే దూరప్రాంత, అంతర్‌జిల్లా, అంతర్రాష్ట్ర బస్సులను నగరంలోని అంతర్గత ప్రాంతాల్లోకి రాకుండా ఆయా దిశల్లో ఏర్పాటు చేసే టెర్మినల్స్ వరకు మాత్రమే నడిపించే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. విమానాశ్రయం

-2వ పేజీలో



# అనుమతులుంటే ఊరట

**'22ఏ' బాధితులకు ఉపశమనం కలిగించే దిశగా సర్కారు కీలక నిర్ణయం**

- హెచ్ఎండీఏ, డీటీసీపీ, జీహెచ్ఎంసీ అనుమతులిచ్చిన లే ఔట్లు, భవనాలు నిషేధిత జాబితా నుంచి తొలగింపు!
- సీఎం నేడు శాసనసభలో ప్రకటించే అవకాశం
- సామాన్యులకు ఇబ్బందులు తొలగిపోయేలా దిద్దుబాటు చర్యలు వెల్లడించే చాన్స్
- మంత్రులతో సీఎం రేవంత్ చర్చ
- నేడు అసెంబ్లీ ప్రారంభానికి ముందు మళ్లీ భేటీ

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ప్రజాతీర్పు)

నిషేధిత భూముల (22ఏ) విషయంలో బాధితులకు ఉపశమనం కలిగించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ), డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ (డీటీసీపీ) అనుమతిలిచ్చిన లే ఔట్‌లలోని భూములు కూడా 22ఏ పరిధిలోకి వచ్చిన నేపథ్యంలో.. వాటిని వెంటనే ఆ జాబితా నుంచి తొలగించేలా సీఎం రేవంత్‌రెడ్డి

-2వ పేజీలో

# హైదరాబాద్ రవాణా వ్యవస్థ విస్తరణకు సమగ్ర ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

వైపు వెళ్లే బస్సులు, హైదరాబాద్‌కు వచ్చే అంతర్‌జిల్లా బస్సు లు కూడా అవసరాన్ని బట్టి నిర్దేశిత టెర్మినల్స్ వద్దే నిలిపి, అక్కడి నుంచి ప్రయాణికులను నగరంలోని వివిధ ప్రాంతాలకు తరలించే విధంగా లాస్ట్ మైల్ కనెక్టివిటీని బలోపేతం చేయనున్నట్లు వెల్లడించారు. టెర్మినల్స్ నుంచి ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు సులభంగా చేరుకునేలా సిటీ ఆర్టీసీ బస్సులు, మెట్రో రైలు, ఎంఎంటీఎస్ సేవలను సమన్వయం చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. దీంతో నగరంలోకి వచ్చే ప్రయాణికులకు సౌకర్యవంతమైన, వేగవంతమైన ప్రజా రవాణా అందుబాటులోకి వస్తుందని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో ప్రైవేట్ బస్సులు ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడం, రాత్రి సమయాల్లో రోడ్లపైకి పెద్ద సంఖ్యలో రావడం వల్ల ట్రాఫిక్ రద్దీతో పాటు కాలుష్యం కూడా పెరుగుతోందని మంత్రి తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రైవేట్ బస్సులను కూడా నిర్దేశిత బస్ టెర్మినల్స్ ద్వారా నిర్వహించే విధానంపై ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందన్నారు. అవసరమైన నిబంధనల మేరకు యూజర్ ఛార్జీలు వసూలు చేస్తూ టెర్మినల్స్‌ను వినియోగించుకునే విధానాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాలకు వెళ్లే ప్రైవేట్ బస్సులు, ఆర్టీసీ దూరప్రాంత బస్సులు నగరంలోని రద్దీ ప్రాంతాల్లోకి ప్రవేశించకుండా టెర్మినల్స్ వరకు మాత్రమే నడిపించే విధానం అమలులోకి వస్తే నగర ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. బస్ టెర్మినల్స్ ఏర్పాటుకు అవసరమైన భూమి విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గాజులరామారం ప్రాంతంలో సుమారు 100 ఎకరాలు, శంషాబాద్ వైపు సుమారు 150 ఎకరాల భూమిని బస్ టెర్మినల్ అవసరాలకు కేటాయించే అంశంపై ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని టెర్మినల్స్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడంతో పాటు, ప్రయాణికులకు వేచి ఉండే ప్రదేశాలు, పార్కింగ్, కనెక్టివిటీ తదితర సౌకర్యాలను కల్పించేలా ప్రణాళిక రూపొందించనున్నట్లు మంత్రి తెలిపారు.



### 2,200 ఎలక్ట్రిక్ బస్సులతో ప్రజా రవాణాకు మరింత బలం

హైదరాబాద్ నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రానున్న 2,200 ఎలక్ట్రిక్ బస్సులను సమర్థవంతంగా వినియోగించనున్నట్లు మంత్రి తెలిపారు. కొత్త ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా నగరంలోని వివిధ ప్రాంతాలకు మెరుగైన సిటీ బస్ కనెక్టివిటీ కల్పించడంతో పాటు, బస్ టెర్మినల్స్ నుంచి నగరంలోని ప్రతి ప్రాంతానికి ప్రయాణికులు సులభంగా చేరుకునేలా రూట్లను రూపొందించనున్నట్లు తెలిపారు. టెర్మినల్ ఆధారిత ప్రజా రవాణా వ్యవస్థతో నగరంలోకి వచ్చే బస్సుల సంఖ్యను నియంత్రించడంతో పాటు, ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ప్రజా రవాణా మార్గాలను అందుబాటులోకి తీసుకురావచ్చన్నారు.

### ట్రాఫిక్, కాలుష్య నియంత్రణకు కీలక అడుగు

హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా రవాణా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నగరంలోకి వచ్చే దూరప్రాంత, అంతర్‌జిల్లా, అంతర్రాష్ట్ర బస్సులను నగర శివార్లలోని టెర్మినల్స్ వద్దే నిలిపి, అక్కడి నుంచి సిటీ బస్సులు, మెట్రో, ఎంఎంటీఎస్ ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే విధానం వల్ల నగరంలోని ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు వాహన కాలుష్యం కూడా తగ్గుతుందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌ను మరింత సుస్థిరమైన, సమర్థవంతమైన ప్రజా రవాణా నగరంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ గేమ్ స్టార్ట్!

(మొదటి పేజీ తరువాయి)

అస్త్రం కూడా. అందుకే కేసీఆర్ ప్రజల్లోకి వస్తే "అప్పుడు ఎలా ఉంది.. ఇప్పుడు ఎలా ఉంది?" అనే చర్చను ముందుకు తీసుకెళ్లే అవకాశమే ఎక్కువ. ముఖ్యంగా 2023లో బీఆర్ఎస్‌కు దూరమైన గ్రామీణ ఓటర్లను తిరిగి పలకరించడంలో 'పదేళ్ల పాలన' కేసీఆర్‌కు కీలక రాజకీయ అస్త్రంగా మారొచ్చు.

### కేటీఆర్ పాదయాత్ర..

కేటీఆర్ ఇప్పటికే కాంగ్రెస్ సర్కార్‌కు వ్యతిరేకంగా రాజకీయ పోరాటం చేస్తున్నా.. ఇప్పుడు దానికి మరో రూపం జోడించారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటి విడుదలపై ప్రభుత్వం స్పష్టమైన షెడ్యూల్ ఇవ్వకపోతే కోదాడ నుంచి హాలియా వరకు రైతులతో కలిసి పాదయాత్ర చేస్తానని ప్రకటించారు. పాదయాత్ర తీరు తెన్నులేమి ఇంకా రూపుదిద్దుకోలేదు. తేదీ కూడా ఖరారు కాలేదు. కానీ ప్రత్యేకంగా పాదయాత్ర ప్రకటించడం వెనుక రాజకీయ సందేశం స్పష్టమే. ఒక సమస్యను పట్టుకుని ప్రజల మధ్య మరింత విస్తృతంగా పోరాటం చేయడానికి ఆయన సిద్ధమవుతున్నారన్న సంకేతం ఇది. అది కూడా గతంలో కేసీఆర్ (2003లో) చేపట్టిన కోదాడ–హాలియా పాదయాత్రను గుర్తు చేసే మార్గంలోనే. కేటీఆర్ పాదయాత్ర నిజంగా మొదలైతే.. ఇది ప్రతిపక్ష పార్టీగా చేస్తోన్న పోరాటానికి ఇది మరో కీలక అడుగుగా మారొచ్చు.

### సమస్యలపై పోరాటం..

ఇక హరీశ్‌రావు తనదైన పద్ధతిలో ప్రజా సమస్యలను పట్టుకుని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. 22ఏ భూముల వ్యవహారంలో బాధితులతో సమావేశాలు నిర్వహిస్తూ.. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నిస్తున్నారు. ఈ అంశంపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో విలీనం చేసే ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ విద్యార్థుల తరపున గళమెత్తుతున్నారు. సమస్యను పట్టుకోవడం.. బాధితుల దగ్గరకు వెళ్లడం.. ప్రభుత్వాన్ని నిలదీయడం హరీశ్‌రావు రాజకీయ శైలికి ఇవే ప్రధాన బలాలుగా కనిపిస్తున్నాయి. ఈ మూడు దారులు గులాబీ పార్టీని ఒకే రాజకీయ లక్ష్యం వైపు ఎంతవరకు తీసుకెళ్తాయన్నదే కీలకం. కేసీఆర్ 'పదేళ్లు'.. కేటీఆర్ 'పాదయాత్ర'.. హరీశ్ 'ప్రజా పోరాటం' ఈ త్రిసూత్రం గులాబీ పార్టీకి మళ్లీ రాజకీయ ఊపు తెస్తుందా? అన్నది మాత్రం వేచి చూడాల్సిందే.

# అనుమతులుంటే ఊరట

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం శాసనసభలో ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. గ్రేటర్ హైదరాబాద్ నగర పాలక సంస్థ నుంచి అధికారిక అనుతులున్న వాటికి కూడా ఈ వెసులుబాటు లభించనున్నట్లు సమాచారం. 22ఏ అంశంలో 8 అంశాలను గుర్తించామని, వాటిపై ఎలా ముందుకెళ్లాలన్న దానిపై శాసనసభలో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించిన విషయం విదితమే. కాగా 22ఏ జాబితా తమను ఇరకాటంలోకి నెట్టిందన్న భావిస్తున్న ప్రభుత్వం ఇప్పటికే కొన్ని చర్యలు తీసుకున్నా.. మరింత స్పష్టతతో సభా వేదికగా దిద్దుబాటు చర్యలు ప్రకటించనున్నట్లు తెలిసింది. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వివేక్‌లతో సమావేశమయ్యారు. ఈ భేటీలో 22ఏ విషయంలో ఎలా ముందుకెళ్లాలన్న దానిపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది.

చిన్న ప్లాట్లు, ఇళ్లు, అపార్ట్‌మెంట్‌లలో ఫ్లాట్లు అవసరార్థం విక్రయించడానికి వెళ్లితే.. అవి కాస్తా 22ఏ ఉన్నట్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చెబితేనే కానీ యజమానులకు తెలియని పరిస్థితి నెలకొనడంతో ఈ అంశం తీవ్ర వివాదాస్పదంగా మారిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి పలు దఫాలుగా రెవెన్యూ అధికారులతో సమావేశాలు నిర్వహించారు. తాజాగా 22ఏకు తుది రూపు ఇవ్వాలన్న ఉద్దేశంతో మంగళవారం సమావేశం నిర్వహించినట్లు సమాచారం. అయితే ఈ విషయంలో ఎలాంటి తుది నిర్ణయానికి రాలేదని చెబుతున్నా.. అధికారికంగా అనుతులున్న లే ఔట్‌లకు 2007 సంవత్సరం లింక్ డాక్యుమెంట్‌లను పరిశీలించి వాటిని 22ఏ నుంచి తొలగించడం ద్వారా ప్రధాన సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నట్టు సమాచారం. దశాబ్దాల కిందట ఇళ్ల నిర్మాణాలు చేసుకున్న వారి స్థలాలను ఇప్పుడు 22ఏలో పెట్టడం వల్ల ప్రయోజనం ఉండదన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. మునుగోడు ఎన్నిలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం ..ఎల్‌బీ నగర్‌లోని పలు కాలనీలు అర్బన్ ల్యాండ్ సీలింగ్(యూఎల్‌సీ) పరిధిలో ఉంటే, వాటిని యూఎల్‌సీ నుంచి తప్పించి ఉత్తర్వులు జారీ చేసింది. అక్కడి ప్రజల నుంచి డబ్బు కట్టించుకున్న నేపథ్యంలో ఏ విధంగా వాటిని యూఎల్‌సీ నుంచి తొలగించారు? అన్న దానిపై మంగళవారం నాటి భేటీలో చర్చించినట్లు తెలిసింది. కాగా ప్రభుత్వం నుంచి పలు అవసరాల కోసం భూములు లీజుకు తీసుకున్న వారు ఆ స్థలాల్లో భవనాలు నిర్మాణాలు చేసుకున్నారని, ఇప్పుడు వారికిచ్చిన లీజు గడువు ముగియడంతో, వాటి లీజును రద్దు చేయడమా? లేక లీజు కొనసాగించడమా.? లేక వారికి విక్రయించడమా అన్న అంశం కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారికి వెయ్యి చదరపు గజాల వరకు క్రమబద్ధీకరణ చేయడానికి జారీ చేసిన జీవో 59 కింది స్థలాలను కూడా ఎలాంటి క్రయ విక్రయాలు జరపకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిషేధం విధించిన విషయం విదితమే. అయితే కొన్నివేల మంది డబ్బు చెల్లించి వాటిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

# యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు

- ఎండీఆర్‌ను కస్టమర్ల నుంచి వసూలు చేయరాదని.. వ్యాపారులే భరించాలని స్పష్టీకరణ
- అక్టోబర్ 15 నుంచి అమల్లోకి.. కేంద్ర ఆర్థిక శాఖ నోటిఫికేషన్

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ప్రజాతీర్పు)

దేశంలో దాదాపు ఆరేళ్లుగా కొనసాగుతున్న పూర్తి ఉచిత యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) చెల్లింపుల సేవలకు కేంద్ర ప్రభుత్వం తెరదించింది. యూపీఐ చెల్లింపులపై చార్జీల విధానాన్ని పునఃప్రవేశపెట్టాలంటూ గూగుల్ పే, అమెజాన్ పే, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, జియో పేమెంట్స్ బ్యాంక్ సహా మరికొన్ని సంస్థలు సభ్యులుగా ఉన్న పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తెచ్చిన ఒత్తిడితోపాటు ఏటా రూ. 40 లక్షలకుపైగా టర్నోవర్ ఉండే వ్యాపారులపై చార్జీలు విధించాలన్న ఆర్‌బీఐ, బ్యాంకుల సూచనను పరిగణనలోకి తీసుకుంది. వ్యక్తుల నుంచి వ్యాపారులకు రూ. 2 వేలకుపైగా జరిగే యూపీఐ చెల్లింపుల లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించనున్నట్లు మంగళవారం ప్రకటించింది. అలాగే రూ. 75 వేలకన్నా ఎక్కువ విలువైన యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్‌ను గరిష్టంగా రూ. 300గా ఖరారు చేసినట్లు తెలిపింది. అయితే రూ. 2 వేలలోపు వ్యక్తుల నుంచి వ్యాపారులకు జరిపే యూపీఐ చెల్లింపులతోపాటు వ్యక్తుల నుంచి వ్యక్తుల మధ్య జరిగే యూపీఏ లావాదేవీలు, చిరు వ్యాపారులకు ఎలాంటి ఎండీఆర్ చార్జీ వర్తించదని స్పష్టం చేసింది. అక్టోబర్ 15 నుంచి నూతన విధానం అమల్లోకి వస్తుందని వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ, భారత జాతీయ చెల్లింపుల సంస్థ (ఎన్‌పీసీఐ) సంయుక్తంగా నోటిఫికేషన్ విడుదల చేశాయి. ఎండీఆర్ రుసుము రూపంలో ఏటా పేమెంట్స్ పరిశ్రమకు రూ. 16,000 కోట్లు వస్తాయని అంచనా.

'యూపీఏ ద్వారా చేసే చెల్లింపులపై వినియోగదారులు ఎలాంటి చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. వ్యాపారుల చెల్లింపుల వ్యవస్థలో ఎండీఆర్ ఒక రకమైన చార్జీ. ఇది యూపీఐ చెల్లింపులు జరిపే వినియోగదారులపై విధించే చార్జీ కాదు. వ్యక్తులు ఎప్పటిలాగే ఎలాంటి పరిమితులు, కోటాలు లేకుండా పూర్తి ఉచితంగా యూపీఐ లావాదేవీలు కొనసాగించవచ్చు' అని కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. ఎండీఆర్‌ను కస్టమర్ల నుంచి వసూలు చేయరాదని.. వ్యాపారులే భరించాలని స్పష్టం చేసింది. అలాగే ఎండీఆర్ చార్జీల భారాన్ని వ్యాపారులు వినియోగదారులపై మోపకుండా చూడాలని బ్యాంకులను ఆదేశించింది. అదే సమయంలో యూపీఐ యాప్‌ల ప్రొవైడర్లు ప్లాట్‌ఫాం ఫీజులు లేదా హిడెన్ చార్జీలు వసూలు చేయడాన్ని నిషేధించింది.

### కీలక రంగాలకు యూపీఐ చెల్లింపులపై..

అయితే రైల్వే టికెట్ల బుకింగ్, టెలికం రీచార్జీలు, బీమా ప్రీమియం చెల్లింపులు, పెట్రోల్ బంకుల్లో ఇంధనం నింపుకోవడం వంటి వాటికి వ్యక్తులు రూ. 2 వేలకుపైగా జరిపే యూపీఐ చెల్లింపులపై ఒక్కో లావాదేవీకి రూ. 5 చొప్పున ఎండీఆర్ వర్తిస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. అలాగే రూ. 2 వేలకు మించిన విద్యుత్ బిల్లులు, నీటి బిల్లులు, పైప్డ్ గ్యాస్ బిల్లులపై జరిపే యూపీఏ చెల్లింపులతోపాటు రూ. 2 వేలకు మించిన స్కూలు ట్యూషన్ ఫీజు, యూనివర్సిటీ ఫీజు చెల్లింపులపైనా ఒక్కో లావాదేవీపై రూ. 5 చొప్పున ఎండీఆర్ ఉంటుందని పేర్కొంది. అయితే రూ. 2 వేలకన్నా తక్కువగా ఉండే బిల్లులు, ఫీజులపై మాత్రం ఎలాంటి టీడీఆర్ ఉండదని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. మరోవైపు మ్యూచువల్ ఫండ్లు, సెక్యూరిటీల చెల్లింపులు, స్టాక్‌బ్రోకర్లు, డీలర్ల ద్వారా జరిపే చెల్లింపులపై 0.02 శాతం టీడీఆర్ వర్తిస్తుందని తెలిపింది. అయితే వ్యక్తుల ఖాతా నుంచి వ్యాపారుల ఖాతాకు నేరుగా జరిగే యూపీఐ చెల్లింపులకు మాత్రమే ఎండీఆర్ వర్తిస్తుందని.. యుటిలిటీ బిల్లులు, ఓటీటీ సబ్‌స్క్రిప్షన్లు, పునరావృత పెట్టుబడులకు సంబంధించి అమలయ్యే యూపీఐ మ్యాండేట్‌లు లేదా ఆటోపే విధానాలకు ఎండీఆర్ ఉండదని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది.

### ఎందుకీ చార్జీ?

మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ద్వారా వసూలయ్యే మొత్తంలో కొంత యూపీఐ లావాదేవీల సేవలు అందిస్తున్న బ్యాంకులు, యాప్‌లకు పంచుతామని ఎన్‌పీసీఐ తెలిపింది. అలాగే మిగిలిన మొత్తాన్ని దేశంలో మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడుల ఊతానికి, నూతన ఆవిష్కరణాలు, సైబర్ సెక్యూరిటీ, కస్టమర్ సర్వీస్ రంగాలకు ఉపయోగిస్తామని వివరించింది. అలాగే టైర్3 పట్టణాలు, ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూకాశ్మీర్, లద్దాఖ్‌లలో డిజిటల్ చెల్లింపుల మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి, ఆర్థిక రాయితీలు ఇవ్వడానికి ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయనుంది. కొత్త వ్యాపారులను డిజిటల్ పరిధిలోకి తీసుకురావడానికి ఈ నిధి నుంచి ఆర్థిక సహాయం అందించనుంది. దేశంలో 2021లో కోవిడ్ వ్యాప్తి వేళ యూపీఐ చెల్లింపులను ప్రోత్సహించేందుకు ఎండీఆర్ చార్జీని తొలగించిన కేంద్ర ప్రభుత్వం.. దీనివల్ల బ్యాంకులు, పేమెంట్ సర్వీసు ప్రొవైడర్లకు అయ్యే వ్యయాన్ని బడ్జెట్ కేటాయింపుల ద్వారా భరిస్తూ వచ్చింది. అయితే యూపీఏ సేవల నిర్వహణ, సర్వర్ల బ్యాండ్‌విడ్త్ వ్యయం, బ్యాంకుల సాంకేతిక సహాయ ఖర్చులు ఏటా సుమారు రూ. 20 వేల కోట్లను చేరడంతో తమ బడ్జెట్ కేటాయింపుల ద్వారానే ఆ మొత్తాన్ని భర్తీ చేయలేమని కేంద్రం చెబుతోంది. యూపీఐని నిర్వహిస్తున్న నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ప్రకారం ఆగస్టులో దేశవ్యాప్తంగా రూ. 29,82,356 కోట్ల విలువైన యూపీఐ లావాదేవీలు జరిగాయి. అలాగే లావాదేవీల సంఖ్య 2,451 కోట్లు దాటింది.

# పోలీస్ స్టేషన్లలోనే గూండాల రాజ్యమా?!

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)



ప్రజల చేత రెండుసార్లు ముఖ్యమంత్రిగా ఎన్నికై, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నేత, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ ఇంటిపై వేలమంది గూండాలను పంపించి దాడి చేయించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు ఏకంగా పోలీస్ స్టేషన్లనే అడ్డాగా చేసుకుని హత్యాకాండకు తెరలేపిందని మండిపడ్డారు. మంగళవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన రేవంత్ రెడ్డి ప్రభుత్వ దుర్మార్గాలను ఎండగట్టారు.

### ఠాణాలో దాడి చేసింది పోలీసులా? గూండాలా?

కేసీఆర్ ఇంటిపై దాడిని అడ్డుకునేందుకు వెళ్లిన తమను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి, అక్కడ కూడా తమపైకి గూండాలను ఉసిగొల్పారని కేటీఆర్ గుర్తుచేశారు. ఆ దుర్మార్గం చాలదన్నట్లు, నిన్న విచారణ పేరుతో పోలీస్ స్టేషన్‌కు పిలిపించి తన పీఆర్‌వో మహేష్ ముదిరాజ్, పీఏ మహేందర్ రెడ్డిలపై ఏకంగా 15 మందితో దాడి చేయించారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "పోలీస్ స్టేషన్ లోపలే మఫ్టీలో వచ్చి దాడి చేసిన ఆ 15 మంది గూండాలా? లేక పోలీసులా? అనేది తేలాలి" అని డిమాండ్ చేశారు. బాధితుల తరఫున ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్లి ఐదు గంటల పాటు నిలదీసి జీరో ఎఫ్ఐఆర్ చేయమన్నా పోలీసులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేని అత్యంత ఘో రమైన, దిగజారిన పరిస్థితులు నేడు తెలంగాణలో నెలకొన్నాయని విమర్శించారు.

### పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా మారారు.. న్యాయస్థానాల్లో తేల్చుకుంటాం

తెలంగాణలో పోలీస్ శాఖ అధికార పార్టీ తొత్తుగా మారి, కాంగ్రెస్ కార్యకర్తల కంటే హీనంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఠాణాలోనే దాడులు చేస్తున్న దుండగులకు పోలీసులు వత్తాసు పలుకుతూ రక్షణగా నిలుస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర పోలీసు వ్యవస్థను నమ్ముకుంటే న్యాయం జరగదని ప్రజలకు, తమకు పూర్తిగా అర్థమైందని.. అందుకే ఈ దాడులు, పోలీసుల తీరుపై న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నామని స్పష్టం చేశారు. కోర్టుల్లో తమకు తప్పకుండా న్యాయం జరుగుతుందన్న పూర్తి విశ్వాసం ఉందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తాము ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే, ప్రజలకు సమాధానం చెప్పుకోలేక నిరాశ, నిస్పృహలతోనే రోజుకో అంశాన్ని తెరపైకి తెస్తూ 'అటెన్షన్ డైవర్షన్' రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే భౌతిక దాడులకు దిగుతోందని, ఇలాంటి బెదిరింపులకు బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరూ భయపడే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. ప్రజా క్షేత్రంలోనే ఈ అరాచక సర్కారుకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని తేల్చిచెప్పారు.

# వీసా గడువుపై నియంత్రణకు కోర్టు బ్రేకులు

(మొదటి పేజీ తరువాయి)

విజిటర్ వీసాదారులు అమెరికాలో గరిష్టంగా నాలుగేళ్లు మాత్రమే ఉండవచ్చు. జర్నలిస్టుల విషయంలో ఈ పరిమితి 240 రోజులు మాత్రమే. చైనాకు చెందిన మీడియా వారైతే 90 రోజుల కంటే ఎక్కువ సమయం అమెరికాలో ఉండేందుకు వీల్లేదు. వాస్తవానికి ఈ నిబంధనలు మంగళవారం నుంచి అమల్లోకి రావాల్సి ఉండింది. కొత్త నిబంధనలపై ఇచ్చిన స్టేను ప్రతివాదులకు మాత్రమే పరిమితం చేయాలని, దేశం మొత్తానికి అన్వయించవద్దని అమెరికా ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని మసాచూసెట్స్ ఫెడరల్ డిస్ట్రిక్ట్ కోర్టు న్యాయమూర్తి ఎఫ్.డెన్నిస్ సెలర్ 4 తిరస్కరించారు. న్యాయమూర్తి నిర్ణయంతో కొత్త నిబంధన అమలుకు బ్రేక్ పడుతుంది. కేసుపై న్యాయస్థానంలో విచారణ సాగుతుంది. అమెరికా ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కొత్త నిబంధనను సుమారు 600 ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు సవాలు చేశాయి. అయితే అమెరికాలో ఐదు వేలకుపైగా విద్యా సంస్థలున్నాయని, పిటిషనర్లకు మాత్రమే స్టే వర్తింపజేయడం సమస్యలకు దారితీస్తుందని, ఒక్కో విద్యార్థి, సంస్థ ఈ నిబంధనల పరిధిలోకి వస్తారా? లేదా? అన్నది పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని న్యాయమూర్తి తన తీర్పులో ప్రస్తావించారు. "సాధారణంగా ఒక పీహెచ్‌డీ కోర్సు పూర్తయ్యేందుకు ఆరేళ్ల సమయం పడుతుంది. కాబట్టి విద్యార్థి వీసాలకు నాలుగేళ్ల కటాఫ్ విధించడం విచిత్రం"అని హార్వర్డ్ విద్యాసంస్థ అధ్యక్షుడు అలన్ ఎం గార్బర్ వ్యాఖ్యానించారు. అయితే వీసాలపై ఇలాంటి పరిమితులు విధిస్తేనే మోసాలను అరికట్టవచ్చని, వీసా గడువు తీరిన తరువాత కూడా అమెరికాలో ఉండిపోవడాన్ని అడ్డుకోవచ్చునని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ వాదించింది. అయితే కొత్త నిబంధన కూడా దుర్వినియోగం అయ్యేందుకు అవకాశముందని న్యాయమూర్తి విచారణ సందర్భంగా వ్యాఖ్యానించారు. "ప్రభుత్వంపై విమర్శలు గుప్పించే విదేశీ జర్నలిస్టుల వీసాలు పొడిగించకుండా ఉండేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రయత్నించే అవకాశాలు ఎక్కువ"అని న్యాయమూర్తి తన తీర్పులో స్పష్టం చేశారు. "కొత్త నిబంధనకు, దాని వెనుక ఉన్న హేతువుకు మధ్య సంబంధం బలహీనంగా కనిపిస్తోంది. న్యాయమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ కొత్త నిబంధనలు నిజంగానే దేశ భద్రత, సరిహద్దుల రక్షణకు ఉద్దేశించిందా? లేక అప్రకటిత లక్ష్యాల సాధనకా?.. ఉదాహరణకు విద్యాసంస్థలు, మీడియాపై ప్రభుత్వం మరింత పట్టు సాధించేందుకా? అన్న ప్రశ్నలు వస్తున్నాయి"అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

# ఈ ప్రాంతాన్ని ఉస్మానిస్థాన్‌గా మార్చాలనుకున్న నిజాం

(మొదటి పేజీ తరువాయి)

జి.కిషన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అంతకుముందు ఆలయంలో వారు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి, భాగ్యనగర్, గోల్కొండ భాజపా జిల్లాల అధ్యక్షులు నిరంజన్, ఉమా మహేంద్ర సహా పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ.. 'హైదరాబాద్‌ను ప్రత్యేక రాజ్యంగా ఉంచి, ఉస్మానిస్థాన్‌గా మార్చి పాకిస్తాన్‌లో కలపాలని నిజాం కుట్ర పన్నాడు. నిజాం, రజాకార్ల క్రూర హింసకు వ్యతిరేకంగా పోరాటం జరిపి ఎందరో జాతీయవాదులు ప్రాణత్యాగం చేశారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్న నైజాం ప్రాంతాలు తమ విమోచన దినోత్సవాన్ని గర్వంగా జరుపుకొంటున్నాయి' అని గుర్తు చేశారు. నిజాం సైన్యం, రజాకార్ల దాష్టీకాలకు వ్యతిరేకంగా తెలంగాణ మహిళలు అద్భుత ధైర్యంతో పోరా డారని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. 'సర్దార్ పటేల్ జోక్యంతో సెప్టెం బరు 17న తెలంగాణ ప్రాంతానికి స్వాతంత్ర్యం వచ్చింది. అమరవీరుల ఆత్మబ లిదానాలు, 4 కోట్ల మంది తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ.. కేంద్ర ప్రభుత్వం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో అధికారికంగా 'హైదరాబాద్ లిబరేషన్ డే' వేడుకలను ఘనంగా నిర్వహిస్తోంది. గురువారం జరిగే హైదరాబాద్ ముక్తి దినోత్సవంలో ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్, గవర్నర్ శివప్రతాప్ శుక్లా సహా ముఖ్యులు పాల్గొంటారు' అని కిషన్‌రెడ్డి తెలిపారు.



# పేదల పక్షపాతిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

### ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్.

**(గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) సెప్టెంబర్ 15.**

పార్టీలు మారి ప్రభుత్వాన్ని విమర్శించడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నా. 5లక్షల విద్యుత్ ప్రమాద పరిహార చెక్కు లబ్ధిదారులకు అందజేసిన జగిత్యాల శాసనసభ్యులు తిప్పన్న పెట్ గ్రామానికి చెందిన చింతకుంట రాజా నర్సయ్య ఇటీవల విద్యుత్ షాక్ తో మరణించగా మంగళవారం భార్య లక్ష్మీకి మంజూరైన విద్యుత్ ప్రమాద చెక్కు 50వేలు,4లక్షల 50వేల బాండ్ ను,జగిత్యాల పట్టణ బుడిగజంగాల కాలని కి చెందిన సిరిగిరీ ఎల్లవ్వ విద్యుత్ షాక్ తో మరణించగా భర్త వెంకటయ్య కు తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ శాఖ ద్వారా మంజూరైన 50వేలు చెక్కు,4లక్షల 50వేల బాండ్ ను జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో డి సి సి అధ్యక్షులు గాజంగి నందయ్య టి పి సి సి సెక్రటరీ బండ శంకర్, కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్ కౌన్సిలర్ తిరుమలయ్య, నాయకులు సమీండ్ల శ్రీనివాస్ ,అడువల లక్ష్మణ్ బాల ముకుందం నక్కల రవీందర్ రెడ్డి రౌతు గంగాధర్ ములసపు మహేష్ లైశెట్టి విజయ్ గోపి శ్రీనివాస్ కౌన్సిలర్ పిట్ట ధర్మరాజు జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు దుమల రాజ్ కుమార్ ఏ డి ఈ జవహర్ నాయక్, ఏ ఈ లు ప్రవీణ్, సుందర్,గట్టు రాజు తొలిప్రేమ శ్రీనివాస్ మహేష్ నాయకులు విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలి

### కోరుట్ల తహసీల్దార్‌కు బీజేపీ నాయకుల వినతి

**కోరుట్ల, సెప్టెంబర్ 15 (ప్రజాతీర్పు )**

సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ కోరుట్ల మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కోరుట్ల మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. మండల బీజేపీ అధ్యక్షుడు పంచిరి విజయ్‌కుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ తెలంగాణ ప్రాంతం అప్పటి నిజాం నిరంకుశ పాలనలో కొనసాగిందన్నారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆధ్వర్యంలో జరిగిన ఆపరేషన్ పోలో అనంతరం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందని తెలిపారు.సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తామని గత ప్రభుత్వాలు హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆలస్యం చేయకుండా అధికారిక జీవో జారీ చేసి, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు గుగ్గిల్ల తుకారాం గౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు విట్టల్, రాజేందర్ రెడ్డి, గోపు ప్రశాంత్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఏలేటి రాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు రాజు, బీజేపీ సీనియర్ నాయకులు లింగారెడ్డి, అవునూరి రాజు, భూమానందం, శేఖర్, పుంద్ర విజయ్, మహేష్, బండ వంశీ పాల్గొన్నారు.



# అంబల్ల భాగ్యవతి మృతి తీరని లోటు

- కోరుట్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మానుక ప్రవీణ్ కుమార్

**కోరుట్ల సెప్టెంబర్ 15 (ప్రజాతీర్పు)**

తెలుగుదేశం పార్టీ మాజీ సీనియర్ నాయకురాలు, కథలాపూర్ మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీ అధ్యక్షురాలు, బుగ్గారం నియోజకవర్గ టీడీపీ మాజీ ఇన్‌చార్జ్ అంబల్ల భాగ్యవతి మృతి తీవ్ర విషాదకరమని కోరుట్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మానుక ప్రవీణ్ కుమార్ అన్నారు.భాగ్యవతి మృతి పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆమె మరణం పార్టీకి, ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు.తెలుగుదేశం పార్టీ తరఫున ప్రజలకు భాగ్యవతి అందించిన సేవలు, ఆమె చేపట్టిన పదవులు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు.అంబల్ల భాగ్యవతి పార్థివదేహానికి టీడీపీ పార్టీ జెండా కప్పి ప్రవీణ్ కుమార్ నివాళు లర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహదేవ్, తారక్, రాజు, హరీష్ కుమార్, పాతర్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కోడెలను రాజన్న ప్రసాదంగా భావించాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.
- కోడెల సంరక్షణకు 45 ఎకరాల్లో అధునాతన గోశాల నిర్మాణం.
- రైతులకు 500 కోడెల పంపిణీ

**(పాష సయ్యద్, ప్రజాతీర్పు, వేములవాడ) సెప్టెంబర్ 15**



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కు చెందిన తిప్పాపూర్ గోశాలలోని 500 కోడెలను మంగళవారశీ జిల్లా కలెక్టర్ గరీమా అగ్రవాల్ తో కలిసి పేద రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి కోడెలను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో ఎంపిక చేసిన నిరుపేదలు, సన్న, చిన్నకారు రైతులకు అందజేస్తున్నామని తెలిపారు. గతంలో కోడెలను స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వడం వల్ల ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నిజమైన రైతులకు రాజన్న ప్రసాదంగా అందిస్తున్నామన్నారు. రైతులు కోడెలను రాజన్న ప్రసాదంగా భావించి సొంతింటి బిడ్డల్లాసంరక్షించాలని, కోడెలను రైతుల పేరుతో తీసుకుని అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడెల ఆరోగ్య పరిరక్షణ కోసం దేవస్థానం పరిధిలోనే వారం రోజుల్లో వెటర్నరీ డాక్టర్‌ను ఏర్పాటు చేయాలనినిర్ణయించామని, అనారోగ్యానికి గురైన కోడెలను ఇతర వాటి నుంచి వేరు చేసి చికిత్స అందించేందుకు ఒక ఎకరం స్థలాన్ని జిల్లా కలెక్టర్ కేటాయించారని తెలిపారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కోడెలకు టీకాలు, వైద్యం, నాణ్యమైన పోషకాహారం, దాణా అందిస్తున్నామన్నారు. పాలు మరవని చిన్న కోడెలను మొక్కుగా సమర్పించవద్దని, ఆరోగ్యంగా, ఎదిగిన కోడెలను మాత్రమే స్వామివారికి సమర్పించాలని, దూర ప్రాంతాల నుంచి చిన్న కోడెలను వాహనాల్లో తీసుకురావడం వల్ల ఒత్తిడి, అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, జెర్సీ కోడెలకు స్థానిక వాతావరణం అనుకూలించకపోవడంతో సమస్యలు వస్తున్నాయని, వీలైనంత వరకు దేశీ జాతి, ఆరోగ్యకరమైన కోడెలను సమర్పించాలని భక్తులను కోరారు. కోడెలకు 45 ఎకరాల్లో అధునాతన గోశాల ఏర్పాటు చేసేందుకు స్థలం గుర్తించామని, త్వరలో గోశాల ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయ ఈవో రమాదేవి, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు తదితరులు పాల్గొన్నారు.



## సెప్టెంబర్ 17ను విస్మరిస్తే చరిత్రను విస్మరించినట్టే

- తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి
- రాష్ట్ర ప్రభుత్వం వేడుకలు నిర్వహించాలి బీజేపీ నాయకుల డిమాండ్

**(రాంపెల్లి చంద్రశేఖర్ ప్రజాతీర్పు తాండూర్ మండలం రిపోర్టర్) సెప్టెంబర్ 15**

తాండూర్ : సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1948లో తెలంగాణతో పాటు విముక్తి పొందిన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో మాత్రం రాజకీయ కారణాలతో విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడంలో ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయని విమర్శించారు.తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన అనంతరం గోల్కొండ ఖిల్లాపై ఉత్సవాలు నిర్వహించడంతోనే సరిపెట్టుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రజాపాలన దినోత్సవం' పేరుతో తెలంగాణ విమోచన దినోత్సవ ప్రాధాన్యతను మరుగున పడేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం 2023 నుంచి హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా సెప్టెంబర్ 17న అధికారికంగా వేడుకలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 1948 సెప్టెంబర్ 13న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఆపరేషన్ పోలో అనంతరం సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని తెలిపారు. నాటి చారిత్రక పరిస్థితులను భావితరాలకు తెలియజేసేలా ఈ అంశాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్, జిల్లా కార్యదర్శి రామగౌని మహిధర్‌గౌడ్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్ధం మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, మండల కార్యదర్శి గాదె రాజేశం, సీనియర్ నాయకుడు కోమండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్ కు గడువు సెప్టెంబర్ 30

**హుస్నాబాద్ సెప్టెంబర్ 15 రవీందర్ ప్రజా తీర్పు**



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2026 - 27 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు పొందడానికి సెప్టెంబర్ 30 వరకు పొడిగించినట్లు హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. కాగా బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరగోరు విద్యార్థులు స్టడీ సెంటర్ కోడ్ 174, హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ గా వ్యవహరిస్తున్న డాక్టర్ వడ్నాల చంద్రమౌళిని సెల్ నెంబర్ 8897402310 లో గాని లేదా జూనియర్ అసిస్టెంట్ సదానందం సెల్ నెంబర్ 9703969348 లో గాని సంప్రదించి అడ్మిషన్ ప్రక్రియలో కావాల్సిన సహాయ సహకారాలు పొందాలని పేర్కొన్నారు. దరఖాస్తులు చేసుకోవాల్సిన విద్యార్థులు ఎస్ ఎస్ సి మెమో, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ సైజు ఫోటోలతో సంప్రదించాలని కోరారు.

## ఇంజక్షన్ వికటించి వ్యక్తి మృతి...

- డాక్టర్ల నిర్లక్ష్యంతో జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపణలు
- అరణ్య రోధనాల మధ్య విలపిస్తున్న కుటుంబ సభ్యులు...

**కురవి సెప్టెంబర్ 15(ప్రజా తీర్పు విలేఖరి)**



ఎంతో ప్రశాంతంగా,నిరాడంబరంగా ఉండే మనిషి,ప్రతిరోజు నిత్యం గీత కార్మికుడిగా పని చేసుకుంటూ,చేను చెలక దగ్గరికి వెళ్ళి తన జీవనోపాధిని పెంపొందించుకుని ఉంటున్న క్రమంలో కాలికి గాయమైనందున మహబూబాబాద్ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందటానికి వెళ్లి అక్కడ ఇంజక్షన్ వేసుకున్న క్రమంలో ఇంజక్షన్ వికటించి వ్యక్తి మృతి చెందడం జరిగింది. వివరాల్లోకి వెళితే కురవి మండలంలోని మోదుగులగూడెం గ్రామానికి చెందిన గునిగంటి సాయిలు (65) అనే వ్యక్తి మహబూబాబాద్ లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం వెళ్ళి ఇంజెక్షన్ వేసుకున్న క్రమంలో ఇంజక్షన్ వేసిన వెంటనే ఒళ్ళు ఒనుకుడు వచ్చిన క్రమంలో వెంటనే వేరే ఆసుపత్రికి తీసుకెళ్లాలని డాక్టర్ సూచించారు.వెంటనే కుటుంబ సభ్యులు ఖమ్మం ఓ ప్రైవేట్ హాస్పిటల్ తీసుకువెళ్ళగా అప్పటికే వ్యక్తి మరణించాడని తెలిపారు.కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇంజక్షన్ వేసిన వైద్యులే గునిగంటి సాయిలు కు ఇంజక్షన్ చేసిన ఆ ఇంజక్షన్ వికటించి చనిపోయాడని కుటుంబ సభ్యులు అరణ్య రోధనాల మధ్య విలపిస్తూ తెలిపారు.అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులు వారి సొంత గ్రామం మోదుగుల గూడెం గ్రామానికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.



## ఘనంగా మాలోత్ నెహ్రూ నాయక్ జన్మదిన వేడుకలు...

- హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించిన కార్యకర్తలు, అభిమానులు

**కురవి సెప్టెంబర్ 15 (ప్రజా తీర్పు విలేఖరి)**

నమ్మకానికి నిలువెత్తు రూపం, సేవకు చిరునామాగా, ప్రజల గుండెలో చెరగని ముద్రగా గుర్తుండిపోయేటట్టు చేస్తున్న సేవలకు మన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాలోత్ నెహ్రూ నాయక్ హైదరాబాద్ లో తన స్వగృహంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు మాలోత్ నెహ్రూ నాయక్ ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయ పూర్వక జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.అనంతరం మాలోత్ నెహ్రూ నాయక్ తనను కలిసి జన్మదిన శు భాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశీస్సులు,కార్యకర్తల ప్రేమాభిమానాలు తనకు ఎప్పటికీ మరింత ఉత్సాహాన్ని ఇస్తాయని పేర్కొన్నారు.

# గోతుల మయంగా "జమ్మికుంట -వావిలాల" రోడ్డు





- వాహనదారుల నరకయాతన ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణం !
- ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర అసహనం.

**జమ్మికుంట సెప్టెంబర్ 14 ప్రజాతీర్పు (వంశీకృష్ణ)**

జమ్మికుంట పట్టణం నుండి వావిలాల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. గత కొన్ని నెలలుగా ఈ రోడ్డు గుంతలమయంగా మారి, ప్రయాణికులకు నరకాన్ని చూపిస్తోంది. స్థానిక ప్రజలు, వాహనదారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ రహదారిపై ప్రయాణం అంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. రోడ్డంతా పెద్ద పెద్ద గుంతలు, తేలిన కంకరతో నిండిపోయింది. కొద్దిపాటి వర్షానికే గుంతలన్నీ



నీటితో నిండి, చెరువులను తలపిస్తున్నాయి. దీనివల్ల గుంతల లోతు తెలియక ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆటోలు, కార్లు నడపడం కూడా కష్టతరంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రికి తరలించడానికి అంబులెన్సులు రావడానికి కూడా గంటల సమయం పడుతోంది. ఈ దారిలో ఎదురుగా వచ్చే వాహనాలకు కష్టంగా మారింది.

**నెలల తరబడి ఇదే దుస్థితి.**

గత కొన్ని నెలలుగా రోడ్డు ఇదే స్థితిలో ఉన్నప్పటికీ, సంబంధిత అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ రోడ్డు అధ్వాన్న స్థితి కారణంగా వాహనాలు కూడా త్వరగా పాడైపోతున్నాయని, మరమ్మతుల కోసం వేలాది రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ దారుణమైన పరిస్థితిపై స్థానిక ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి, ఈ రహదారికి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టి, తమ కష్టాలను తీర్చాలని వారు కోరుతున్నారు.

# చెన్నూర్‌ను ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం






- 2027 గోదావరి పుష్కరాలకు చెన్నూర్ లో 70 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు
- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) సెప్టెంబర్ 15**

చెన్నూర్ ను ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని, 2027 జూలైలో జరగనున్న గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ లో పుష్కర ఘాట్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, నీటిపారుదల శాఖ అధికారి విష్ణు, మండల తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మ లతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు 2027 కొరకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పనుల కొరకు 1 వేయి కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని, ఇందులో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చెన్నూర్ లో పుష్కరాలు, మౌలిక వసతుల అభివృద్ధి కొరకు 70 కోట్ల రూపాయలతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. సుమారు 8 కోట్ల రూపాయలతో పుష్కర ఘాట్లు, స్నానపు గదులు, రహదారులు తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, పుష్కరాలకు దాదాపు 1 లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా రోడ్లు, త్రాగునీరు, పారిశుధ్యం, లైటింగ్, పార్కింగ్ తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గోదావరి రోడ్డుతో పాటు చెన్నూర్ పట్టణంలోని రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని, అంబేద్కర్ విగ్రహం నుంచి చెన్నూర్ వరకు సుమారు 5 కోట్ల 50 లక్షల రూపాయలతో రోడ్డు విస్తరణ, లైటింగ్ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోయిన చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా షాపులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని, పేదలు, చిరు వ్యాపారులకు ప్రయోజనం కలిగేలా 1 కోటి 20 లక్షల రూపాయల డి ఎం ఎఫ్ టి నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అమృత్ 2.0 పథకం క్రింద సుమారు 30 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రతి ఇంటికి నల్లా ద్వారా త్రాగునీరు అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. చెన్నూర్ పెద్ద చెరువును సుమారు 17 కోట్ల రూపాయలతో చేసేందుకు చర్యలు చేపడుతున్నామని, శివ్వారం గోదావరి మొసళ్ల మడుగు ప్రాంతాన్ని అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించి పనులు చేపడుతున్నామని, కాళేశ్వరం, ధర్మపురి, బాసర, భద్రాచలం, కోటిలింగాల, చెన్నూర్ లోని అంబ అగస్తేశ్వర ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పుష్కరాల నాటికి ఆలయాలు, పుష్కర ఘాట్లు, రోడ్లు తదితర అభివృద్ధి పనులు పూర్తి చేసి భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. చెన్నూర్ లో నిర్మించిన 100 పడకల ఆసుపత్రిని ఈ నెలలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అనంతరం పుష్కర ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో భూమిపూజ నిర్వహించారు. చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు బొక్కలగూడెంలో గౌడ సంఘం కమ్యూనిటీ భవనానికి భూమిపూజ చేశారు. సుమారు 30 లక్షల రూపాయల వ్యయంతో కమ్యూనిటీ భవనం నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. పేద గౌడ కులస్తులలో ఇందిరమ్మ ఇళ్లు లేని అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ఇళ్ల సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెన్నూర్ లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సన్న బియ్యం పంపిణీ తదితర అంశాలపై మంత్రి సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. లి అనంతరం జిల్లాలోని మందమర్రి మండలం రామకృష్ణాపూర్ ప్రాంతంలోని 5వ వార్డులో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు షేర్ ద విజన్ - ఖమ్మం సంస్థ ప్రతినిధి పి.నారాయణ అందజేసిన వాటర్ బాటిల్, నోట్ పుస్తకాలు, క్రీడా సామాగ్రి లతో కూడిన కిట్లను జిల్లా కలెక్టర్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, షేర్ ద విజన్ సంస్థ సభ్యుల తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కిట్లు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో రూఫింగ్ పనుల కొరకు 30 లక్షల రూపాయల డి ఎం ఎఫ్ టి నిధులు మంజూరు చేయడం జరిగిందని, విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రమైన త్రాగునీటి కొరకు ఆర్.ఓ. ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు, కాస్మెటిక్ ఛార్జీలు, క్రీడా సామగ్రి తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. మెస్ చార్జీలను 40 శాతం పెంచడం జరిగిందని, ఉపాధ్యాయుల నియామకం చేపట్టి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ మండలం సోమనపల్లిలో ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసానికి ఎంతో ఉపయోగపడుతుందని, విద్యార్థులు అందుబాటులోకి వచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. చెన్నూర్ లో డిగ్రీ కళాశాల అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్ పథకం ద్వారా విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో ఈ సంవత్సరం విద్యార్థుల నమోదు పెరిగిందని తెలిపారు. సోమనపల్లిలో సుమారు 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. 100 మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ఆర్.ఓ. ప్లాంట్ల ఏర్పాటు, నాణ్యమైన ఆహారం, యూనిఫాంలు తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, సొంత భవనాలు లేని పాఠశాలలకు సొంత భవనాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, ఏకరూప దుస్తులు, పుస్తకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో లెర్నింగ్ అవుట్‌కమ్స్ మెరుగ్గా ఉన్నాయని, ఇదే స్థాయిని కొనసాగించేలా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## అక్షరాల అందం.. సృజనాత్మకతల సందడి

- కోరుట్ల బాలికల పాఠశాలలో ఘనంగా తెలుగు భాషా మేళా

**కోరుట్ల, సెప్టెంబర్ 15 (ప్రజాతీర్పు)**

కోరుట్ల పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా మేళాను ఘనంగా నిర్వహించారు.సుమారు 160 మంది విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తెలుగు భాషపై తమకున్న అభిరుచిని చాటారు.విద్యార్థినులు తెలుగు అక్షరాలు, పదాలు, వాక్య నిర్మాణం, చార్టులు, చిత్రాలు, విద్యా నమూనాలతో ఆకట్టుకునే ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వడ్లకొండ గంగాధర్ మేళాను ప్రారంభించారు.తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి. మోహన్, గంగోలా నరేశం ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థినుల ప్రదర్శనలను పరిశీలించి అభినందించారు.తెలుగు ఉపాధ్యాయులు అందె రాజేందర్, సి. పుష్పలత, ఎం. సుజాత, ఎస్. లక్ష్మి మార్గదర్శకత్వంలో కార్యక్రమం నిర్వహించారు.ప్రతిభ కనబరిచిన సిద్రా మహీన్, చిన్మయి, మాన్వి సింగ్, హారిణిలకు బహుమతులు అందజేశారు.మాతృభాషపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు విద్యార్థినుల్లో సృజనాత్మకత, వ్యక్తీకరణ సామర్థ్యాలను వెలికితీయడమే మేళా లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.



## భూముల రీసర్వే కు రైతులు సహకరించాలి

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

**(బుగ్గ కృష్ణమూర్తి శర్మ ప్రజా తీర్పు, ఎల్లారెడ్డిపేట) సెప్టెంబర్ 15**

భూముల రీసర్వే కు రైతులు సహకరించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ కోరారు. భూముల రీసర్వే ప్రక్రియ తదితర అంశాలపై ఎల్లారెడ్డిపేట మండలం సింగారంలో మంగళవారం గ్రామసభ నిర్వహించగా, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పాల్గొన్నారు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేశ్ మాట్లాడుతూ.. భూముల వివరాలను క్షేత్ర స్థాయిలో పక్కాగా సేకరించాలని, రోజు వారీగా లక్ష్యం నిర్దేశించుకుని, రీ సర్వే పూర్తి పారదర్శకతతో చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో సర్వే చేసే ముందు జీపీఓలు, ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఏ ఏ సర్వే నంబర్ భూముల సమాచారం చేరవేయాలని ఆదేశించారు. గ్రామ సరిహద్దుల రీ సర్వే, ఇతర పనులను తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు.. సర్వే పై ఎలాంటి అపోహలు వద్దని, రైతులు సర్వేకు పూర్తిస్థాయిలో సహకరించాలని తెలిపారు. సమావేశంలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, తహసీల్దార్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



## వినాయక విగ్రహ దాతలుగా తుప్పత్ ఆనంద్ - ఉమాదేవి దంపతులు

- యువ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణనాధునికి ప్రత్యేక పూజలు.

**మేడిపల్లి, సెప్టెంబర్ 15 (ప్రజాతీర్పు):**

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్ పరిధి బోడుప్పల్లో వినాయక చవితి సందర్భంగా భక్తిశ్రద్ధలతో గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వినాయక విగ్రహ దాతలైన తుప్పత్ ఆనంద్, ఉమాదేవి దంపతులు పూజల్లో పాల్గొని గణనాధుని ఆశీర్వాదాలు పొందారు. అనంతరం వారు మాట్లాడుతూ, సమాజంలో ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందించడంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి సంవత్సరం ఇదే విధంగా వినాయక ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ పూజా కార్యక్రమంలో యువ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు తమ కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో పాల్గొని గణనాధునికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. కార్యక్రమం అంతటా భక్తి గీతాలు,మంత్రోచ్చారణలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో మైసగళ్ల శివ, ఎర్ర మైసి గారి రాజు, దాన గళ్ళ సురేష్, చినిగిర్ల శ్రీకాంత్, గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.



## కోరుట్ల అభివృద్ధి పనులకు రూ.78 కోట్లు మంజూరు చేయాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి జువ్వాడి నర్సింగరావు వినతి

**కోరుట్ల, సెప్టెంబర్ 15 (ప్రజాతీర్పు )**

కోరుట్ల నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు సుమారు రూ.78 కోట్ల నిధులు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కోరారు.ఈ మేరకు హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి నియోజకవర్గంలోని రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులు, సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు.కల్లూర్ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం, సిరిపూర్--చిట్టాపూర్ రహదారిని రెండు వరుసల రహదారిగా విస్తరించడం, నేషనల్ హైవే--యూసఫ్‌నగర్ రహదారి విస్తరణ, మొగిలిపేటలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, వర్షకొండ--గోధూర్ రహదారి రెన్యువల్ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.అలాగే మెట్‌పల్లి--దామరాజ్‌పల్లి--ఖానాపూర్ రహదారి రెన్యువల్, రంగారావుపేట--కేసీఆర్ తండా సమీపంలో స్లాబ్ కల్వర్టు నిర్మాణం, వెల్లుల గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు నిధులు కేటాయించాలని నర్సింగరావు మంత్రిని కోరారు.జువ్వాడి నర్సింగరావు విజ్ఞప్తిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ లేఖ పంపినట్లు తెలిపారు.



## గ్రామాల్లో చర్మవ్యాధిగ్రస్త వీధికుక్కల భయం -

స్పందించని సంబంధిత శాఖలు

**( కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) సెప్టెంబర్ 15**

ఇటీవల గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో చర్మవ్యాధులతో బాధపడుతున్న వీధికుక్కలు విస్తృతంగా కనిపిస్తూ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఒక్క గ్రామమే కాదు పట్టణ ప్రాంతాలలో ఏ గ్రామంలో చూసినా ఇదే పరిస్థితి నెలకొంది. శరీరమంతా గాయాలు, మచ్చలతో తిరుగుతున్న కుక్కలు పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లడానికి కూడా భయపడే పరిస్థితి ఏర్పడింది. ఈ వ్యాధులు మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా సంబంధిత పశు సంవర్ధక, గ్రామశాఖలు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. వీధికుక్కలకు తక్షణ వైద్య చికిత్స అందించడం, నియంత్రణ చర్యలు చేపట్టడం, వ్యాధి వ్యాప్తి నివారణపై అవగాహన కల్పించడం అత్యవసరంగా మారింది. ప్రజల ఆరోగ్యం, భద్రత దృష్ట అధికారులు వెంటనే చర్యలు తీసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన శనిగరం విద్యార్థులు

**(వకులాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 15)**



సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ వారు గజ్వేల్ లో ఇటీవల నిర్వహించిన అండర్ 16 సబ్ జూనియర్ బాలికల విభాగంలో నిర్వహించిన కబడ్డీ పోటీలలో కోహెడ మండలం శనిగరం ఉన్నత పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు ఎన్ హర్షిత, జి శ్రీలేఖ, టి ఆరాధ్య లు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనారు. ఈనెల 26 నుండి రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో ఈ ముగ్గురు విద్యార్థులు పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను, వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు చక్రం రమ్యను ప్రధానోపాధ్యాయురాలు ఎం సరళ, ఉపాధ్యాయ బృందం అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

## అంగన్వాడికేంద్రాలలో పోషణ్ మాసంవేడుకలు ఘనంగా

**( కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్ ) సెప్టెంబర్15**




పోషణ మాసం షెడ్యూల్లో భాగంగా తాళ్ల ధర్మారం1౿2అంగన్వాడి కేంద్రాలలో పోషణ్ మాసం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ ఎస్ సువర్ణ మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం ఇంట్లో తయారు చేసినవి పెట్టాలని, ప్రోటీన్స్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, పప్పు దినుసులు, సీజనల్ పండ్లు తీసుకోవాలని సూచించారు. 6 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లలకు బాలామృతం ప్రతిరోజు తినిపించాలని సూచించారు. చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ సిహెచ్.వినోద లక్ష్మణ్ పంచాయతీ కార్యదర్శి లివిన్ కుమార్ అంగన్వాడి టీచర్లు హనుమక్క, సీతు బాయ్, ఆశ కార్యకర్త రాజేశ్వరి, తల్లులు, కిషోర్ బాలికలు పిల్లలు హాజరైనారు.

# ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు చోరీ.. ముగ్గురు అరెస్ట్

- రూ.3.57 లక్షల విలువైన 178.5 కిలోల కాపర్ వైరు స్వాధీనం

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజా తీర్పు) సెప్టెంబర్ 15**



టేకులపల్లి:వ్యవసాయ భూముల్లోని- ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైరు చోరీ చేస్తున్న ముగ్గురు వ్యక్తులను టేకులపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి చోరీకి ఉపయోగించిన ఆటోతో పాటు సుమారు రూ.3.57 లక్షల విలువైన 178.5 కిలోల కాపర్ వైర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు, ఇల్లందు డీఎస్పీ యు. వెంకన్నబాబు సూచనలతో, టేకులపల్లి సీఐ బి. సత్యనారాయణ పర్యవేక్షణలో ఎస్ఐ కె. తిరుపతి సిబ్బందితో కలిసి మంగళవారం మధ్యాహ్నం సమ్మక్క--సారక్క గద్దెల వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం వైపు నుంచి టేకులపల్లి వైపు వస్తున్న ఓ ఆటో పోలీసులను చూసి వెనక్కి తిరిగి పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు పట్టుకుని విచారించారు. విచారణలో ఆటోలో ఉన్న పల్లపు వెంకటేష్ (35), రౌతు రమేష్ (34), వేముల సంతోష్ (34)లు గత కొంతకాలంగా కలిసి చోరీలకు పాల్పడుతున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో టేకులపల్లి మండలంలోని ముత్యాలంపాడు, కోయగూడెం, శాంతినగర్, సులానగర్, 9 మైల్ తండా, కొక్య తండా, బోడ్ ఏరియాలోని పెట్రం చేలక ప్రాంతాల్లో వ్యవసాయ భూముల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైరు చోరీ చేసినట్లు పేర్కొన్నారు.అలాగే కొత్తగూడెంలోని సింగరేణి స్థలంలోనూ కాపర్ వైరు చోరీ చేసినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. చోరీ చేసిన కాపర్ వైర్‌ను సంతోష్ ఆటోలో తరలించి పాల్వంచలోని సాయిరాం స్క్రాప్ షాప్‌తో పాటు తెలకలపల్లి బాబుకు విక్రయించినట్లు నిందితులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.ఈ కేసులో టీ ఎస్ 04 యూఏ 9768 నంబర్ గల ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఏ 4 తెలకలపల్లి బాబు, ఏ 5 పాల్వంచకు చెందిన సాయిరాం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అరెస్టైన నిందితుల్లో పల్లపు వెంకటేష్ పెనుగడప గ్రామం, చుంచుపల్లి మండలానికి చెందినవాడు కాగా, రౌతు రమేష్ మణుగూరులోని శేషగిరినగర్‌కు, వేముల సంతోష్ కొత్తగూడెంలోని రామవరం నాగయ్యగడ్డకు చెందినవారిగా పోలీసులు వివరించారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన టేకులపల్లి సీఐ బి. సత్యనారాయణ,.ఎస్ఐ కె. తిరుపతి, ఏఎస్ఐ బి. నరసింహారావు, సిబ్బందిని ఇల్లందు డీఎస్పీ యు. వెంకన్నబాబు అభినందించారు.



# బాబోయ్ ..ఈ సారు...మాకు వద్దు.

- విద్యార్థులతో.. ఉపాధ్యాయుడు అసభ్య ప్రవర్తన.
- సార్ వస్తే బడి బంద్ చేస్తామంటూ విద్యార్థుల నిరసన.

**జమ్మికుంట, సెప్టెంబర్ 15 ప్రజాతీర్పు**

విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పి సక్రమమైన మార్గంలో నడిపించవలసిన ఉపాధ్యాయుడు విద్యార్థులను దండించడమే కాకుండా అసభ్యకరంగా ప్రవర్తించడం పట్ల ఈ సారు మాకు వద్దు అంటూ నిరసన చేసిన సంఘటన కరీంనగర్ జిల్లాలో సంచలనం సృష్టించింది. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో పనిచేస్తున్న రామ్ రాజయ్య అనే ఉపాధ్యాయుడు విద్యార్థులను కొట్టడమే కాకుండా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు అంటూ విద్యార్థులు మంగళవారం పాఠశాల ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ రామ్ రాజయ్య అనే ఉపాధ్యాయుడు తమకు సరిగా చదువు చెప్పకుండా ఇష్టం వచ్చినట్లు కొట్టడమే కాకుండా తన సెల్ ఫోన్ లో ఉన్నటువంటి అసభ్యకరమైన చిత్రాలను చూపెడుతూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తమ తల్లిదండ్రులకు తెలియజేయగా తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయునికి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పూర్తిగా వివరాలు సేకరించిన ప్రధానోపాధ్యాయులు బాదం సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు చెప్పిన తరహాలో తన ప్రవర్తన ఉందని ఈ విషయం గురించి ఉన్నతాధికారులకు నివేదికను పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. కాగా ఈ విషయం జరుగుతున్న సమయంలో సదరు ఉపాధ్యాయుడు పాఠశాలలో లేకపోవడంతో తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుని తీరును గురించి ప్రశ్నించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మాత్రం ఈ సారు పాఠశాలలో ఉంటే తాము బడికి రామని బహిరంగంగా వెల్లడించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీస్ అధికారులు పాఠశాలకు చేరుకొని విద్యార్థుల దగ్గర నుండి పూర్తి వివరాలు సేకరించి తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# సెప్టెంబర్ 17 ముమ్మాటికీ తెలంగాణ విమోచన దినోత్సవమే. రాణి రుద్రమ రెడ్డి

**నర్సంపేట సెప్టెంబర్ 15 ప్రజాతీర్పు ప్రతినిధి**

నర్సంపేట నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా మిత్రుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ మాట్లాడుతూ... "సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో మరుపురాని, మరుగునపరచలేని చారిత్రక ఘట్టం. నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లోకి వచ్చిన రోజును 'తెలంగాణ విమోచన దినోత్సవం' గా గౌరవించడం ప్రతి తెలంగాణ బిడ్డ బాధ్యత. సెప్టెంబర్ 17ను 'విలీన దినం', 'ప్రజా పాలన దినం' అంటూ పేర్లు మార్చినంత మాత్రాన చరిత్ర మారదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చారిత్రక దినోత్సవం అసలు స్ఫూర్తిని మరుగునపరచడం ప్రజా పాలన కాదు, అది చరిత్రపై రాజకీయ ప్రయోగం అని అన్నారు, సెప్టెంబర్ 17ను అధికారికంగా 'తెలంగాణ విమోచన దినోత్సవం'గా నిర్వహించాలని సెప్టెంబర్ 17 చరిత్రను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించడం, ఒకే రాజకీయ సిద్ధాంతానికి కట్టిపడేయడం మానుకోవాలి." అని అన్నారు. అనంతరం లిబీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ... "హైదరాబాద్ విమోచన ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాటం రెండూ ఒకటే కావు. వాటి లక్ష్యాలు, రాజకీయ నేపథ్యం, కాలపరిమితి, అంతిమ లక్ష్యాలు వేర్వేరు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లోకి వచ్చిన వాస్తవాన్ని ఎవరూ చెరిపివేయలేరు. సెప్టెంబర్ 17 తరువాత కూడా కమ్యూనిస్టు సాయుధ పోరాటం కొనసాగింది. 1950-51లో కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు స్టాలిన్‌తో చర్చలు జరిపిన అంశాలు చరిత్రలో ఉన్నాయి. తమకు అనుకూలమైన చరిత్రను మాత్రమే చెప్పి, అసౌకర్యంగా ఉన్న చరిత్రను పాతిపెట్టే రోజులు పోయాయని అన్నారు, హైదరాబాద్ విమోచన ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాటం రెండింటి చరిత్రను వేర్వేరుగా, వాస్తవ ఆధారాలతో పాఠ్యాంశాల్లో చేర్చాలని, పరకాల, భైరాన్‌పల్లి వంటి చారిత్రక ఘటనలు, నిజాం నిరంకుశత్వం, రజాకార్ల దమనకాండను నేటి తరానికి తెలియజేయాలని అన్నారు, నిజాం రజాకార్ల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన జాతీయవాదులు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను అధికారికంగా స్మరించాలి. "తెలంగాణ విమోచన చరిత్ర ఎవరి సొత్తూ కాదు. అది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ చరిత్ర. చరిత్రను చరిత్రగానే చెప్పాలి, రాజకీయ రంగులు పులమకూడదు. సెప్టెంబర్ 17 ముమ్మాటికీ తెలంగాణ విమోచన దినోత్సవమే" అని రానా ప్రతాప్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీలో ఫ్లోర్ లీడర్ 2కౌష్ఠ వార్డ్ కౌన్సిలర్ జూలూరి రోజా రాణి , రాష్ట్ర కౌన్సిల్ మెంబెర్ వడ్డేపల్లి నరసింహ రాములు, జిల్లా ఉపాధ్యక్షులు రేసు శ్రీనివాస్, పార్లమెంట్ కో కన్వీనర్ కట్ల రాంచేందర్ రెడ్డి, ఓబీసీ మోర్చా నాయకులు గడ్డం ఆంజనేయులు,మాజీ మండల అధ్యక్షులు అబోతు రాజు యాదవ్,ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు సంగేమ్ శంకర్,నియోజకవర్గ నాయకులు జూలూరి మనీష్ గౌడ్ , జిల్లా కౌన్సిల్ మెంబెర్ మహేందర్ రెడ్డి,పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, రూరల్ అధ్యక్షులు అంబేత్కర్ నల్లబెల్లి అధ్యక్షులు తడక వినయ్ గౌడ్, చెన్నరావుపేట అధ్యక్షులు శేఖర్, బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి అచ్చ దయాకర్ బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు కొంకిసా విగ్నేష్ గౌడ్, ఎర్ర రాజు,బీజేపీ పట్టణ నాయకులు విజయ్ సింగ్, కాసుల నాగేంద్ర బాబు, అల్లం నిఖిల్ ,ముత్యాల శ్రీనివాస్, సామల ప్రవీణ్ కుమార్, నూనె రంజిత్,అజీమ్, అనిల్,బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# సెప్టెంబర్ 22న జరుగు విద్యుత్ సబ్స్టేషన్ల ముట్టడిని జయప్రదం చేయండి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈసంపల్లి బాబు

**నర్సంపేట సెప్టెంబర్ 15 ప్రజా తీర్పు ప్రతినిధి**

వ్యవసాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్తును సరఫర చేయుటలో ఘోరంగా విఫలమైందని తెలంగాణ రైతు సంఘం (ఆల్ ఇండియా కిసాన్ సభ) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈసంపల్లి బాబు విమర్శించారు మంగళవారము మధ్యాహ్నము నర్సంపేట పట్టణంలోని సంఘ కార్యాలయంలో ఇస్లావత్ నెహ్రూ అధ్యక్షతన జరిగిన తెలంగాణ రైతు సంఘం వరంగల్ జిల్లా కమిటీ సమావేశానికి బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడినారు. ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా సెప్టెంబర్ 22న విద్యుత్ సబ్స్టేషన్ల ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు . కాంగ్రెస్ ప్రభుత్వం అధికారాల్లోకి వచ్చినప్పటినుండి విద్యుత్ సరఫరా లో తరచుగా అంతరాయం జరుగుతున్నదని అన్నారు స్థిరంగా అర్ధగంట కూడా విద్యుత్ సరఫరా చేయడం లేదని ఆయన విమర్శించారు. ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన అనావృష్టిని ఏదో ఒక మేరకు తట్టుకోవడం కోసం రైతాంగము తమకున్న బావులు బోర్ల ద్వారా ఎండిపోతున్న పంటలను కాపాడుకోవడం కోసం ప్రయత్నం చేయుచుండగా విద్యుత్తు సక్రమంగా ఆటంకం లేకుండా సరపర కాకపోవడంతో రైతాంగము తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారు. లక్షలాది రూపాయలు అప్పులు చేసి విత్తనాలు తీసుకొచ్చి పంట సాగు చేయడం కోసం రైతాంగం ప్రయత్నం చేస్తున్నారు విద్యుత్ సక్రమంగా రాకపోవడంతో తీవ్రమైన నిరాశలో కొట్టుమిట్టాడుతున్నారని ఆయన ఆవేదన వెలిబుచ్చారు.విద్యుత్ సరఫరాలో జరుగుతున్న అంతరాయాన్ని నివారించాలని ఎన్ని సార్లు అధికారులు,ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెల్లిన ఎక్కడ వేసిన గొంగడి అక్కడనే ఉందితప్ప మార్పు మాత్రము ఏ మాత్రం లేదని ఆయన ఆవేదన వెలిబుచ్చారు.రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడమే కాక కొత్త సమస్యలను సృష్టిస్తూ రైతుల గోసపంచుకుంటున్నారని ఆయన విమర్శించారు.పాలకులు మాత్రం రైతాంగానికి ఏదో ఒరగబెడుతున్నమని బడాయి కబుర్లు చెబుతున్నారు రాష్ట్ర ప్రభుత్వము రైతాంగానికి ఇచ్చిన ఏ ఒక్క హామిని కూడా ఇప్పటివరకు నెరవేర్చలేదు. రెండు లక్షల వరకు రుణమాఫీ అంతంత మాత్రమే చేశారు ఇప్పటికీ సుమారుగా 70% రైతాంగానికి అప్పు మాఫీ కాలేదు పైగా బ్యాంకులు రైతాంగానికి కోర్టుల ద్వారా నోటీసులు పంపించి రైతాంగాన్ని తీవ్రమైన ఆవేదనకు గురి చేస్తున్నారు. అదేవిధంగా రైతు భరోసా కూడా అనేక కొర్రీలు పెట్టి అరాకొరగానే వేస్తున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వం యొక్క వైఖరిలో మార్పు లేనట్టయితే రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రైతులు చేసే ఉద్యమాలకు ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొరబోయిన కుమార స్వామి,కమిటీ సభ్యులు కట్కూరి శ్రీనివాస రెడ్డి,అక్కపెల్లి సుధాకర్,లక్క రాజు,పిండి రాములు, చల్ల నర్సింహ్మ రెడ్డి,నాఖ అన్వర్,గోనె మల్లారెడ్డి,గజ్జెల గోపాల్,పెండ్యాల సారయ్య,రాజులపాటి సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్‌గా శరత్ రెడ్డి

**(బుగ్గ కృష్ణమూర్తి శర్మ ప్రజా తీర్పు ఎల్లారెడ్డిపేట) సెప్టెంబర్,15**



భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా లీగల్ సెల్ కన్వీనర్‌గా ఉచ్చిడి శరత్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ గోకుల్ రామారావు, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి సూచనలతో నియామకాన్ని ప్రకటించారు.ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్పూర్ గ్రామానికి చెందిన శరత్ రెడ్డి గత కొంతకాలంగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. జిల్లా లీగల్ సెల్ కో-కన్వీనర్లుగా మొగిలి రాజు, కటకం జనార్ధన్‌లను నియమించారు. ఈ సందర్భంగా జిల్లా లీగల్ సెల్ కన్వీనర్‌గా తనకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ గోకుల్ రామారావు, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపికి శరత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ కార్యకర్తలకు సంబంధించిన న్యాయపరమైన సమస్యలు, కేసుల విషయంలో జిల్లా లీగల్ సెల్ బృందం అండగా ఉంటుందని శరత్ రెడ్డి తెలిపారు. కార్యకర్తలకు అవసరమైన న్యాయ సహాయాన్ని అందిస్తూ పార్టీ కోసం సమర్థవంతంగా పనిచేస్తానని తెలిపారు.

# గుడుంబా విక్రయాలపై ఎక్సైజ్ దాడులు. ఇద్దరి అరెస్ట్

**(బుగ్గ కృష్ణమూర్తి శర్మ ప్రజా తీర్పు ఎల్లారెడ్డిపేట ) సెప్టెంబర్ 15:**



ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు తండాల్లో అక్రమంగా గుడుంబా తయారీ, విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు మంగళవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఆల్మాస్‌పూర్ తండా, గుంటపల్లి చెరువు తండా, కిస్తునాయక్ తండా, అక్కపల్లి తండాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆల్మాస్‌పూర్ తండాలో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్న ఇద్దరిపై రెండు కేసులు నమోదు చేసి వారిని అరెస్టు చేశారు. వారి నుంచి 6 లీటర్ల గుడుంబా మద్యం స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 100 లీటర్ల బెల్లం పులుపు (ఎఫ్‌జే వాష్)ను అధికారులు అక్కడికక్కడే ధ్వంసం చేశారు. మండలంలోని తండాల్లో అక్రమ మద్యం తయారీ, విక్రయాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అక్రమ మద్యం తయారీకి పాల్పడినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విజేందర్ రెండ్ల, హెడ్ కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్లు కరుణాకర్, వర్మ, ప్రేమలత పాల్గొన్నారు.

# బీఎస్ఎన్ఎల్ రాగి తీగల చోరీ ముఠా ఛేదన-8 మంది నిందితులు అరెస్ట్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) సెప్టెంబర్ 15**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధితో పాటు వివిధ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ టవర్లకు సంబంధించిన రాగి తీగలను చోరీ చేస్తున్న ముఠాను పోలీసులు విజయవంతంగా ఛేదించారు.ఈ కేసులకు సంబంధించి మొత్తం 8 మంది నిందితులను అరెస్ట్ చేసి, న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, న్యాయస్థానం వారిని న్యాయ నిర్బంధానికి పంపించింది. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు,మంచిర్యాల డిప్యూటీ పోలీస్ కమిషనర్ ఎ. భాస్కర్ పర్యవేక్షణలో, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సీసీఎస్ ప్రత్యేక దర్యాప్తు బృందాలు సమన్వయంతో దర్యాప్తు చేపట్టాయి. దర్యాప్తులో భాగంగా సాంకేతిక ఆధారాలతో పాటు అందుబాటులో ఉన్న ఇతర సమాచారాన్ని సమగ్రంగా విశ్లేషించి, బీఎస్ఎన్ఎల్ రాగి తీగల చోరీలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు.

## అరెస్ట్ అయిన నిందితుల వివరాలు



1. ఉప్పరి సంపత్ 2. గొమాసా అజయ్ కృష్ణ
3. మారినేని రాజ్‌కుమార్
4. గొమాసా అనుకృష్ణ 5. దుర్గం శేఖర్
6. దుర్గం అంకులు 7. పాండి రాజ్‌కుమార్
8. సాంబోజు రమేష్

అరెస్ట్ చేసిన నిందితులను న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, న్యాయస్థానం వారిని న్యాయ నిర్బంధానికి పంపించింది. బీఎస్ఎన్ఎల్ రాగి తీగల చోరీలకు సంబంధించి నిందితుల గత నేర చరిత్ర,ముఠా కార్యకలాపాలు, ఇతర ప్రాంతాల్లో నమోదైన ఇలాంటి చోరీ కేసుల్లో వారి ప్రమేయం తదితర అంశాలపై పోలీసులు సమగ్ర దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అవసరమైన మేరకు సంబంధిత గ్యాంగ్ ఫైళ్లు, సస్పెక్ట్ షీట్లు ప్రారంభించి, వారి నేర కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి నేరాలకు పాల్పడకుండా అవసరమైన అన్ని చట్టపరమైన మరియు నిరోధక చర్యలు చేపడుతున్నారు.

## దర్యాప్తులో పాల్గొన్న అధికారులు

ఈ కేసుల ఛేదనలో సీసీఎస్ ఏసీపీ కె. రవీందర్,సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ టి.గోపీ, బెల్లంపల్లి రూరల్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. హనోక్,సీసీఎస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రావు, తాల్లగురిజాల సబ్‌ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ,ఇతర సబ్‌డివిజన్ పోలీస్ సిబ్బంది,సీసీఎస్ ప్రత్యేక బృందం సమన్వయంతో సమర్థవంతంగా కృషి చేశారు.ప్రభుత్వ ఆస్తులు, ప్రజా ఆస్తులు మరియు టెలికాం మౌలిక సదుపాయాల పరిరక్షణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని అధికారులు తెలిపారు.రాగి తీగలు,టెలికాం పరికరాలు మరియు ఇతర ప్రభుత్వ, ప్రజా ఆస్తుల చోరీలకు పాల్పడే వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇలాంటి నేరాలను అరికట్టేందుకు నిరంతరం నిఘా కొనసాగిస్తూ, నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# మాదాపూర్‌లో యువకుడి ఆత్మహత్య

**శేరిలింగంపల్లి, సెప్టెంబరు 15 (ప్రజా తీర్పు)**



మాదాపూర్ : మాదాపూర్ లోని అయ్యప్ప సొసైటీలో ఓ యువకుడు భవనం పై అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల శ్రీకాకుళం జిల్లా, పాతపట్నం ప్రాంతానికి చెందిన కలమట యశ్వంత్ (23), కలమట రమేష్ కుమారుడు. గత సెప్టెంబర్ 2 నుంచి అయ్యప్ప సొసైటీలోని అవాసా కో-లివింగ్‌లో గది నంబర్ 206లో నివాసం ఉంటున్నాడు. జనవరి 2026 నుంచి డెలాయిట్ సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు సమాచారం.మంగళవారం ఉదయం యశ్వంత్ అస్వస్థతకు గురికావడంతో వైరల్ జ్వరం తదితర సమస్యలు ఉన్నాయా అనే నిర్ధారణ కోసం డాక్టర్ సీకి రక్త నమూనాలు ఇచ్చినట్లు తెలిసింది. అనంతరం సుమారు మధ్యాహ్నం 3:08 గంటల సమయంలో భవనం టెర్రస్ నుంచి దూకినట్లు సమాచారం. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువకుడు ఆత్మహత్యకు పాల్పడటానికి గల కారణాలపై విచారణ కొనసాగుతోంది.



## గణేష్ మండపంలో కుటుంబ సమేతంగా మిరియాల ప్రీతమ్ ప్రత్యేక పూజలు

**శేరిలింగంపల్లి, సెప్టెంబరు 15 (ప్రజా తీర్పు)**

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ నగర్‌లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు మిరియాల ప్రీతమ్ తన కుటుంబ సభ్యులతో కలిసి కాలనీవాసులతో ఈ కార్యక్రమంలో పాల్గొని విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిరియాల రాఘవ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ మిరియాల రాఘవరావు కూడా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిరియాల ప్రీతమ్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వినాయక చవితి సందర్భంగా భక్తులు సాధ్యమైనంత వరకు మట్టి వినాయక విగ్రహాలను పూజించి, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పర్యావరణానికి హాని కలిగించని విధంగా పండుగలను నిర్వహించుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ నగర్ కాలనీవాసులు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ ,గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి

**శేరిలింగంపల్లి, సెప్టెంబరు 15 (ప్రజా తీర్పు)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లి గ్రామం లో ముదిరాజ్ యూత్ అసోసియేషన్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక మండపంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ ,గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువత గణేశ మండపాల ద్వారా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.గణనాథుని ఆశీస్సులతో గచ్చిబౌలి డివిజన్ ప్రజలు అభివృద్ధి, శ్రేయస్సు సాధించాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రంగస్వామి ముదిరాజ్,మధు ముదిరాజ్, శివ, సాయి, శ్రీకాంత్, పవన్, సోనూ, రాజేష్, వెంకట్ , పార్టీ నాయకులు,స్థానిక నేతలు,భక్తులు,మహిళలు, పిల్లలు,కాలనీ వాసులు,కార్యకర్తలు,గణేష్ మండపాల నిర్వహకులు,గణేశ భక్తులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## భూ భారతి రీసర్వేపై కొండాపూర్‌లో ప్రత్యేక గ్రామసభ

**హుస్నాబాద్ , సెప్టెంబర్ 15 రవీందర్ ప్రజా తీర్పు**

చిగురుమామిడి మండలంలోని కొండాపూర్ గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణంలో గ్రామ సర్పంచ్ మార్క రాజ్ కుమార్ అధ్యక్షతన భూభారతి రీ సర్వేపై ప్రత్యేక గ్రామసభ మంగళవారం నిర్వహించారు. ఈ గ్రామ సభకు ఏడీసీ కిషన్ రావు, డి. ఐ, శ్రీనివాస్,తహశీల్దార్ కనకయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండాపూర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేశామని, గ్రామస్తులందరూ రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కొండాపూర్ గ్రామ పరిధిలో 1054 ఎకరాల భూమి, 381 సర్వే నెంబర్లు ఉన్నాయని ,ఇందులో 8 ఎకరాలు గ్రామ కంఠం, ప్రభుత్వ భూమి 83 ఎకరాలు, ప్రైవేట్ పట్టా భూమి 951 ఎకరాలు, 365 సర్వే నెంబర్లు ఉండగా 627 మంది పట్టాదారులు ఉన్నట్లు తెలిపారు. ఈ సర్వేలో ప్రతీ భూమిని సర్వే ద్వారా పరిశీలించి ధృవీకరిస్తామని తెలిపారు. రైతులు అభ్యంతరాలు, సమస్యలు ఉంటే సర్వేయర్ కు తెలియజేయలని అన్నారు.ప్రతి ఒక్కరు సహకరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు, సర్వేయర్ బాలమురళీకృష్ణ, ఉపసర్పంచ్,వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## గణేష్ నిమజ్జన పాయింట్ పరిశీలించిన సూర్యాపేట పట్టణ సిఐ వెంకటయ్య

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) సెప్టెంబర్ 15**

సూర్యాపేట టౌన్ పోలీస్ స్టేషన్ గణేష్ నిమజ్జన పాయింట్‌ను పరిశీలించిన సూర్యాపేట టౌన్ సీఐ వెంకటయ్య సూర్యాపేట గణేశ్ నవరాత్రి ఉత్సవాల లో భాగంగా సూర్యాపేట పట్టణంలోని సద్దల చెరువు గణేష్ నిమజ్జన పాయింట్‌ను సూర్యాపేట టౌన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) వెంకటయ్య ఈరోజు క్షేత్రస్థాయిలో సందర్శించి, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనం రోజున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన ముందస్తు ప్రణాళిక లో భాగంగా సందర్శించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నిమజ్జన ప్రాంతంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట టౌన్ ఎస్ఐ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అండగా ఉంటా... అధైర్య పడొద్దు

- మంత్రి పొన్నం ప్రభాకర్
- మాజీ జెడ్పీటీసి కుటుంబానికి ఓదార్పు , భరోసా

**హుస్నాబాద్ సెప్టెంబర్ 15 రవీందర్ ప్రజా తీర్పు**



చిగురుమామిడి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గీకురు రవీందర్ కుటుంబాన్ని రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. రవీందర్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేసిన మంత్రి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ రవీందర్ కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి, వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రవీందర్ మృతి కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా కాంగ్రెస్ పార్టీకి, చిగురుమామిడి ప్రాంత ప్రజలకు తీరని లోటని అన్నారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. రవీందర్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చిగురుమామిడి మండల అధ్యక్షులు అందే సురేష్, సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు మార్క రాజ్ కుమార్, డీసీసీ కార్యదర్శి సాంబారీ బాబు, మాజీ డీసీసీ అధికార ప్రతినిధి అయిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు వంగర మల్లేశం, సర్పంచులు ఆకవరం భవాని శివప్రసాద్, గోగూరు లక్ష్మి మురహరారెడ్డి, చింతపుల నరేందర్, పిఏసిఎస్ డైరెక్టర్ లు పోటు మల్లారెడ్డి, బెజ్జంకి భాగ్య, మర్రి శ్రీనివాస్, సీనియర్ నాయకులు గజ్జెల రాములు, పుదరి వేణు, కూనచుల మహేందర్, వంగ కనకయ్య, పూల లచ్చిరెడ్డి, మాజీ ఎంపీటీసీ చీల లక్ష్మారెడ్డి, వడియాల రవీందర్ రెడ్డి, పచ్చిమట్ల జగన్, జిల్లాల భగవాన్ ప్రసాద్,బోయిని వంశీ కృష్ణ,దొబ్బల బాబు, చెల్పూరీ విష్ణువ చారి,గుడిసె అర్జున్, పచ్చిమట్ల అజయ్, సిరవేణి సంపత్, గడ్డం అనిల్, కవ్వంపెల్లి సంజీవ్,దోమ తిరుపతి రెడ్డి,చెరుకు సమ్మయ్య, బాల కృష్ణ చారి,కొలిపాక వేణు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఒక న్యాయం.. పెద్దలకు మరో న్యాయమా?

- మున్సిపల్ అధికారుల తీరుపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం.. బడా నిర్మాణాలపై ఎందుకు మౌనం?

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15 (ప్రజా తీర్పు)**



పేదవాళ్లకు ఒక న్యాయం.. పలుకుబడి ఉన్నవాళ్లకు మరో న్యాయమా? మున్సిపల్ అధికారుల వ్యవహారశైలిపై సామాన్య ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవితాంతం కష్టపడి సంపాదించిన సొమ్ముతో ఒక్కసారైనా సొంత ఇల్లు నిర్మించుకోవాలనే మధ్యతరగతి కుటుంబాల కలలపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సాధారణ కుటుంబాలు చిన్నపాటి నిర్మాణం చేపట్టినా అనుమతులు, నిబంధనల పేరుతో నోటీసులు, చర్యలు అంటూ అధికారులు హడావుడి చేస్తున్నారని, అదే సమయంలో పెద్ద వ్యాపార సంస్థలు, పలుకుబడి ఉన్న వ్యక్తులు చేపడుతున్న భారీ నిర్మాణాల విషయంలో మాత్రం ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

### చట్టం అందరికీ ఒకటే కాదా?

నిబంధనలు ఉల్లంఘిస్తే అది పేదవారి నిర్మాణమైనా, పెద్దవారి నిర్మాణమైనా ఒకే విధంగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ కొందరి విషయంలో మాత్రం అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ప్రభుత్వ ఆదాయానికి గండి?

గండి మైసమ్మలో పిస్తా హౌస్ పక్కన అక్రమంగా నిర్మిస్తున్న భారీ సెల్లార్ మరోపక్క పోచంపల్లి వెళ్లే దారిలో అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా వాటిపై సకాలంలో చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి కూడా నష్టం వాటిల్లే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు మౌనం వహిస్తే, ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. హైడ్రా దృష్టికి ఈ వ్యవహారాలు వెళ్లడం లేదా? వెళ్లినా ఎందుకు చర్యలు కనిపించడం లేదు? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ముడుపుల ఆరోపణలపై విచారణ జరపాలి

అధికారులపై వస్తున్న అవినీతి, ముడుపుల ఆరోపణలు నిజమా? కాదా? అనే విషయంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే వాస్తవాలను ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని కోరుతున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఒకలా.. పలుకుబడి ఉన్నవారిపై మరోలా వ్యవహరిస్తే సహించేది లేదని ప్రజలు హెచ్చరిస్తున్నారు. నిబంధనలు అందరికీ సమానంగా అమలు చేసి, అక్రమ నిర్మాణాలపై ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



## అనభేరి ప్రభాకర్ రావు విగ్రహాన్ని చౌరస్తాలో వెంటనే ఏర్పాటు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జాతీయ నేత చాడ వెంకట్ రెడ్డి

**హుస్నాబాద్ సెప్టెంబర్ 15 రవీందర్ ప్రజా తీర్పు**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన అనభేరి ప్రభాకర్ రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి తదితర అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపట్టాలని సీపీఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. అనభేరి ప్రభాకర్ రావు విగ్రహాన్ని హుస్నాబాద్‌లోని ప్రధాన చౌరస్తాలో వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 78వ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం హుస్నాబాద్‌లో సీపీఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా సీపీఐ కార్యాలయం వద్ద ఉన్న అనభేరి ప్రభాకర్ రావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మల్లెచెట్టు చౌరస్తా నుంచి అంబేద్కర్ కూడలి మీదుగా ప్రధాన వీధుల గుండా ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించి మహమ్మదాపూర్‌కు చేరుకున్నారు. అక్కడ అమరవీరుల స్మారక స్తూపానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చాడ వెంకటరెడ్డి ఎర్రజెండాను ఆవిష్కరించగా, మహమ్మదాపూర్‌లో నిర్వహించిన వారోత్సవాల సభకు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శిగడిపె మల్లేష్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. నిజాం పాలన, భూస్వామ్య వ్యవస్థలోని వెట్టిచాకిరికి వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్‌తో పాటు అనభేరి ప్రభాకర్ రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి తదితరులు ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు.1947 మార్చి 14న అనభేరి ప్రభాకర్ రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి తదితరులు మహమ్మదాపూర్ గుట్టలకు చేరిన సమయంలో నిజాం సైనికులు, రజాకార్ల బలగాలు అక్కడికి చేరుకుని కాల్పులు జరిపినట్లు చారిత్రక వివరాలు పేర్కొంటున్నాయని తెలిపారు. ఈ ఘటనలో అనభేరి ప్రభాకర్ రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డితో పాటు మరో పది మంది, నిజాం సైన్యానికి చెందిన ఇద్దరు మరణించినట్లు పేర్కొన్నారు. అనభేరి ప్రభాకర్ రావు కరీంనగర్ జిల్లా సీపీఐ తొలి కార్యదర్శిగా పనిచేసి వెట్టిచాకిరి నిర్మూలన కోసం పోరాటం చేశారని చాడ వెంకటరెడ్డి గుర్తుచేశారు. హుస్నాబాద్ లో రోడ్డు విస్తరణ సమయంలో అనభేరి ప్రభాకర్ రావు విగ్రహాన్ని తొలగించడంతో ప్రస్తుతం సీపీఐ కార్యాలయంలో ఉంచాల్సి వచ్చిందని తెలిపారు. అనభేరి ప్రభాకర్ రావు పోరాట చరిత్రను గౌరవించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి హుస్నాబాద్, మహమ్మదాపూర్ ప్రాంతాల అభివృద్ధి, సుందరీకరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో పాటు అమరవీరుల స్మృతిని కాపాడేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి మరోసారి ఉద్యమాలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ జాగిర్ సత్యనారాయణ, కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు అందే స్వామి, హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, నాగెల్లి లక్ష్మారెడ్డి, అదరి రమేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, కోహెడ మండల కార్యదర్శి వెల్పుల శ్రీనివాస్, బెజ్జంకి మండల కార్యదర్శి బోనగిరి రూపేష్, సైదాపూర్ మండల కార్యదర్శి లంక దాసరి కళ్యాణ్, భీమదేవరపల్లి మండల కార్యదర్శి ఆదరి రమేష్, సీపీఐ నాయకులు న్యాలపట్ల రాజు, చాడ శ్రీధర్ రెడ్డి, బత్తుల బాబు, గూడ పద్మ, జనగాం రాజ్ కుమార్, బెక్కంటి సంపత్, గ్రామ శాఖ కార్యదర్శి పిట్టల మేగిలయ్య, సీనియర్ నాయకులు పొదిల కుమారస్వామి, పిట్టల ప్రసాద్, మౌటం బాలయ్య, పిట్టల సుధాకర్, అయిలేని మల్లారెడ్డి, పోలబోజు నరసింహచారి, బంగారు ప్రేమ్ కుమార్‌తో పాటు జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# దుర్గం చెరువులో గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

**శేరిలింగంపల్లి, సెప్టెంబరు 15 (ప్రజా తీర్పు)**



మాదాపూర్: దుర్గం చెరువులో గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను కూకట్‌పల్లి డీసీపీ రీతి రాజ్, (సీఎంసీ) మాదాపూర్ డీసీ బాలకృష్ణతో పాటు అదనపు డీసీపీ ట్రాఫిక్, మాదాపూర్ ఏసీపీ సీ ఎచ్ శ్రీధర్ (లా అండ్ ఆర్డర్), ఏసీపీ ట్రాఫిక్, మాదాపూర్ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ మాదాపూర్ పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్ఓ కె.వీ. సుబ్బారావు లతో బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు దుర్గం చెరువు వద్ద ఏర్పాటు చేసిన క్రేన్ పాయింట్లు, బారికేడింగ్, కంట్రోల్ రూమ్, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా జరిగేలా ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, పార్కింగ్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశించారు.విధుల్లో ఉన్న సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని అధికారులు సూచించారు.

# ఖమ్మం జిల్లాలో...రెండో దఫా అక్రిడేషన్ కార్డులు ఎప్పుడు ఇస్తారు?

- రెండు నెలలుగా ఎదురుచూస్తున్న ఖమ్మం జిల్లా జర్నలిస్టులు
- మొదటి దశలో 800 మందికి కార్డులు.. రెండో దశ కోసం సుమారు 400 మంది నిరీక్షణ
- ఉపముఖ్యమంత్రి,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి ఇలాకాలోనే
- అక్రిడేషన్ కార్డుల కోసం ఇబ్బందులు పడుతున్న జర్నలిస్టులు




తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, తెలంగాణ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల ఇలాకా లోనే జర్నలిస్టులు అక్రిడేషన్ కార్డుల కోసం ఇబ్బందులు పడుతున్నారు గత రెండు నెలలుగా రెండవ దఫా కార్డులు ఎప్పుడు జారీ చేస్తారని సుమారు 400 మంది కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు.ఖమ్మం జిల్లాలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మొదటి దశలో సుమారు 800 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసినప్పటికీ అన్ని అర్హతలు ఉండి రెండవ దఫా అక్రిడేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకొని ఎదురుచూస్తున్న 400 మంది జర్నలిస్టులు ఇంకా ఉన్నారు. రెండో దశ అక్రిడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులు తమ కార్డులు ఎప్పుడు వస్తాయో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అనేక రోజులు గడిచినా ఈ ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో జర్నలిస్టుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

### జాప్యం ఎవరిదీ

అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో జిల్లా కలెక్టర్, అక్రిడిటేషన్ కమిటీ, డీపీఆర్వో కార్యాలయం మధ్య సమన్వయం లేకపోవడం వల్లే జాప్యం జరుగుతోందా? అనే ప్రశ్నలు జర్నలిస్టుల్లో వ్యక్తమవుతున్నాయి. కమిటీ సమావేశానికి సమయం కుదరడం లేదా? అధికారుల స్థాయిలో నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందా? అనే విషయాలు స్పష్టంగా తెలియక జర్నలిస్టులు అయోమయానికి గురవుతున్నారు.

### తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక...

రెండవ దఫా అక్రిడేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టులు మాత్రం తమ సమస్యను ఎవరిని సంప్రదించాలో, ఎప్పుడు పరిష్కారం లభిస్తుందో తెలియని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. జిల్లా అధికార యంత్రాంగం స్పందించి అక్రిడిటేషన్ ప్రక్రియపై స్పష్టమైన సమాచారం ఇవ్వాలని వారు కోరుతున్నారు

### అధికారుల నుంచి స్పష్టత కావాలి

జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో నిరంతరం విధులు నిర్వహిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వారి వృత్తిపరమైన గుర్తింపుకు సంబంధించిన కార్డుల జారీ ప్రక్రియలో సాక్షాత్తు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి ఇద్దరు ఉద్దండులు ఉన్న ఇలాకాలోనే జర్నలిస్టులకు ఇలా ఇబ్బందులు జరిగితే మిగతా జిల్లాల వారి పరిస్థితి ఏమిటి అని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రెండవ అక్రిడేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించాలని రెండవ దఫా అక్రిడేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టులు కోరుతున్నారు.లేనిపక్షంలో ఈ విషయం ఉపముఖ్యమంత్రి దృష్టికి సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళ్లేందుకు కూడా సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది.

–కందుకూరు యాదగిరి
సీనియర్ జర్నలిస్ట్, సూర్యాపేట



## మేలో 50 పడకల ఆసుపత్రి పనులు పూర్తి చేయాలి

- ప్రజలకు అందుబాటులోకి రావాలి
- ఎంఎల్ఏ డా.కవ్వంపల్లి

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట )సెప్టెంబర్ 15**

మండల కేంద్రంలో నిర్మిస్తున్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను ,ఎంఎల్ఏ డా.కవ్వంపల్లి సత్యనారాయణ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించి అధికారులతో మాట్లాడుతూ ఆసుపత్రి భవన నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతులు, అవసరమైన సౌకర్యాలు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారువచ్చే ఏడాది మే నెలలో 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. అనంతరం.మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ:25,46,000 రూపాయల సీఎంఆర్ చెక్కులను పంపిణిచేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ముస్కానిపేట గ్రామ సర్పంచ్ కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి , మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు , ఇల్లంతకుంట సర్పంచ్ ఎం.రాజు , ఫ్యాక్స్ చైర్మన్ వుట్కూరి వెంకటరమణా రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

## నేరేడ్‌మెట్‌లో చైన్ స్నాచింగ్ గ్యాంగ్ అరెస్ట్.. 7 తులాల బంగారం, బైక్ స్వాధీనం

**(వినోద్, ప్రజా తీర్పు, ?నేరేడ్‌మెట్) సెప్టెంబర్ 15**



నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల కలకలం రేపిన చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు. ఈ నేరానికి పాల్పడిన ముగ్గురు సభ్యుల ముఠాను మల్కాజిగిరి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు 7 తులాల బంగారు ఆభరణాలు మరియు నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మల్కాజిగిరి ఏసీపీ యాదగిరి రెడ్డి, సీఐ వెంకటయ్య మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

**కసు వివరాలు:**

ఈ నెల 12న మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో నేరేడ్‌మెట్ పరిధిలో నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగులు తెంచుకుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలంలో ఉన్న సీసీటీవీ (జజుఎ) కెమెరాల ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలించి నిందితులను గుర్తించారు.

**వాహనాల తనిఖీలో దొరికిన ముఠా:**

ఈ నెల 15న ఉదయం 10:30 గంటల ప్రాంతంలో నేరేడ్‌మెట్ ఎక్స్ రోడ్ వద్ద పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా, సదరు చైన్ స్నాచింగ్ తామే చేసినట్లు అంగీకరించారు. అరెస్టయిన నిందితులు: రోహిత్ ఆర్య (19), మహమ్మద్ సోను (30), అసీం (20). ?స్వాధీనం చేసుకున్న సొత్తు: 7 తులాల బంగారు ఆభరణాలు, టీఎస్08బీఈ6819 (టూ 08 దీజు 6819) నంబర్ గల ద్విచక్ర వాహనం. మల్కాజిగిరి జోన్ డీసీపీ పర్యవేక్షణలో, ఏసీపీ యాదగిరి రెడ్డి ఆధ్వర్యంలో కేసును ఛేదించిన నేరేడ్‌మెట్ సీఐ వెంకటయ్య, ఎస్ఐలు సాయి అవినాష్, జి. బాలరాజులతో పాటు క్రైమ్, సైబర్ క్రైమ్ టీమ్‌ల సమర్థవంతమైన పనితీరును ఉన్నతాధికారులు అభినందించారు.



## రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి

- జిల్లా వ్యవసాయ అధికారి చత్రు నాయక్
- రైతు వేదికలో రైతులకు అవగాహన సదస్సు

**హుస్నాబాద్ సెప్టెంబర్ 15 రవీందర్ ప్రజా తీర్పు**

రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు ముగ్గు చూపి రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని జిల్లా వ్యవసాయ అధికారి చత్రు నాయక్ అన్నారు. మంగళవారం సుందరగిరి రైతువేదికలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి చత్రు నాయక్ హాజరై మాట్లాడారు. రైతులు అందరూ ప్రకృతి వ్యవసాయం చేసి నేలను, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, రసాయనిక ఎరువులు వాడకుండా పంట పండించి ఆరోగ్యాలు కాడుకోవాలని రైతులకు సూచించారు. హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం వల్ల నేల సారం పెరుగుతుందని సూక్ష్మ జీవులు సేంద్రీయ పదార్థాలు పెరుగుతాయని పేర్కొన్నారు. పాక్స్ చైర్మన్ చిట్టమల్ల రవీందర్ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం వల్ల నేల, నీరు, గాలి కాలుష్యం తగ్గుతుందని, ఆర్గానిక్ ఉత్పత్తులకు మంచి మార్కెట్ ధర లభించే అవకాశం ఉందని అన్నారు. అనంతరం సుందరగిరి గ్రామ సర్పంచ్ జంగా శిరీష – వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం వల్ల నేల సారం పెరుగుతుందని , రసాయన ఎరువులు,పురుగుమందులు వాడకం తగ్గుతుందని, ఆహార నాణ్యత పెరుగుతుందని పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారి పున్నం చందర్ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం వల్ల సాగు ఖర్చులు తగ్గి నేల, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ రామోజు రాజకుమార్,ఉప సర్పంచ్ మెడబోయిన రాజు, ఏఈఓ లు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



## యువతకు ఉద్యోగాలే లక్ష్యం.. మెగా జాబ్ మేళాను విజయవంతం చేయాలి

- పరిశ్రమలు, విద్యాసంస్థల ప్రతినిధులతో సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారు

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) సెప్టెంబరు 15**

నిరుద్యోగ యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ నెల 19వ తేదీన కోదాడ పట్టణంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, తెలంగాణ పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి గార్ల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహణపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారు పాల్గొని జాబ్ మేళా ఏర్పాట్లు, నిరుద్యోగ యువతకు అందుబాటులోకి రానున్న ఉద్యోగ అవకాశాలు, పరిశ్రమలు--విద్యాసంస్థల సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లు, అధీకృత సీనియర్ ప్రతినిధులతో పాటు వివిధ పరిశ్రమలు, కంపెనీలు, వ్యాపార సంస్థల సీనియర్ ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. యువతలో ఉన్న ప్రతిభకు తగిన ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు విద్యాసంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొని తమ భవిష్యత్తుకు మంచి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు.

# పేదల జీవితాల్లో 'కంటి వెలుగు'

- రంగధామునిపల్లిలో ఉచిత నేత్ర వైద్య శిబిరానికి వెల్లువెత్తిన స్పందన
- 41 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు
- శిబిరాన్ని ప్రారంభించిన తహసీల్దార్ మహమ్మద్ మాజీద్, ఎంపీడీవో రవీందర్ రావు
- రోగులకు అండగా లయన్స్ క్లబ్.. -సర్పంచ్ జెల్లా అఖిల ఆధ్వర్యంలో అన్నదానం

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్ ) సెప్టెంబర్15**




జగిత్యాల జిల్లా గొల్లపెల్లి నిరుపేదల జీవితాల్లో చూపునిచ్చి వెలుగులు నింపేందుకు రంగధామునిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి రంగదామునపల్లి, అగ్గిమల్ల, తిరుమలాపూర్, లక్ష్మీపూర్, రాములపల్లి గ్రామాల నుండి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గొల్లపల్లి మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రి (భాస్కర్ మాడెకర్, లయన్ చిదుర సురేష్) సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని తహసీల్దార్ మహమ్మద్ మాజీద్, ఎంపీడీవో రవీందర్ రావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొమ్మన కుమార్, ప్రోగ్రామింగ్ చైర్మన్, స్థానిక సర్పంచ్ జెల్లా అఖిల – అనిల్ కుమార్‌లతో కలిసి రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.

### సేవా కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తిదాయకం: తహసీల్దార్ మహమ్మద్ మాజీద్

శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం తహసీల్దార్ మహమ్మద్ మాజీద్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత పేద ప్రజల ముంగిట్లోకి అత్యాధునిక కంటి వైద్య సేవలను తీసుకురావడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎంతోమంది కంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ దృష్టి లోపానికి గురవుతున్నారని, అలాంటి వారికి ఇలాంటి ఉచిత శిబిరాలు పునర్జన్మనిస్తాయని పేర్కొన్నారు. పేదలకు మేలుచేసే ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలకు రెవెన్యూ యంత్రాంగం తరఫున ఎల్లప్పుడూ పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు.

### లయన్స్ క్లబ్, ప్రజాప్రతినిధుల చొరవ ప్రశంసనీయం: ఎంపీడీవో రవీందర్ రావు

ఎంపీడీవో రవీందర్ రావు మాట్లాడుతూ, గ్రామీణ పేదల ఆరోగ్య సంరక్షణ కోసం లయన్స్ క్లబ్, స్థానిక సర్పంచ్ చూపిన ప్రత్యేక శ్రద్ధ ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. నేత్రదానం, ఉచిత కంటి శస్త్రచికిత్సల వంటి బృహత్తర కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో మరింత విస్తృతంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు. అధికార యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేసినప్పుడే గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని, ఈ శిబిరం అందుకు చక్కటి నిదర్శనమని ప్రశంసించారు.

### ప్రతీ పేదవాడికి కంటి చూపు అందించడమే లక్ష్యం: లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొమ్మన కుమార్

లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొమ్మన కుమార్ మాట్లాడుతూ, దృష్టి లోపంతో బాధపడుతున్న ఏ ఒక్క పేదవాడూ ఆర్థిక స్తోమత లేక చీకట్లలో మగ్గిపోకూడదనే దృఢ సంకల్పంతోనే ఈ శిబిరం చేపట్టామని తెలిపారు. రేకుర్తి కంటి ఆసుపత్రి వైద్య బృందం సహకారంతో నాణ్యమైన చికిత్స అందిస్తున్నామని, ఎంపికైన రోగులకు శస్త్రచికిత్సతో పాటు రవాణా, మందులు, కళ్లద్దాలు, భోజన వసతిని పూర్తిగా క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా భరిస్తున్నామని వివరించారు.

### సేవ చేయడం దైవకార్యంతో సమానం: ప్రోగ్రామింగ్ చైర్మన్, సర్పంచ్ జెల్లా అఖిల అనిల్ కుమార్

కార్యక్రమ నిర్వాహకులు, ప్రోగ్రామింగ్ చైర్మన్, స్థానిక సర్పంచ్ జెల్లా అఖిల – అనిల్ కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ నిరుపేదల కంటి చూపును కాపాడే ఇలాంటి మహత్తర కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం తమ పూర్వజన్మ సుకృతంగా, తమకు దక్కిన గొప్ప వరంగా భావిస్తున్నామన్నారు. ఆర్థిక స్థోమత లేక ఆపరేషన్లకు దూరమవుతున్న పేదల కళ్లలో ఆనందం చూడటమే తమకు అసలైన సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. శిబిరానికి వచ్చిన రోగులకు, వారి సహాయకులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సొంత ఖర్చులతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

### 41 మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు:

శిబిరంలో పరిసర గ్రామాల నుంచి వచ్చిన 82 మందికి అత్యాధునిక పరికరాలతో నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వీరిలో కంటి శుక్లాలు, తీవ్ర సమస్యలు ఉన్న 41 మంది రోగులను శస్త్రచికిత్స కోసం ఎంపిక చేశారు.ఎంపికైన రోగులను ప్రత్యేక బస్సు ద్వారా కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు.రోగులకు అవసరమైన ఆపరేషన్లు, అత్యాధునిక లెన్సులు, మందులు, కళ్ళద్దాలు, వసతి ఖర్చులను లయన్స్ క్లబ్ సమకూరుస్తోంది. ఈ కార్యక్రమంలో సర్పంచులు కాశ అంజలి గంగాధర్, కాసం రాజశేఖర్, లయన్స్ క్లబ్ కార్యదర్శి మహంకాళి చంద్రశేఖర్, కోశాధికారి సట్ల సురేష్, పాస్ట్ ప్రెసిడెంట్ కరుణాకర్ రెడ్డి, పాస్ట్ కార్యదర్శి నరహరి, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, ఉప సర్పంచ్ అనగందుల శ్రీనివాస్, కొంచెట్టి తిరుపతి, నరిమెట్ల లక్ష్మి, కాసరపు సతీష్ గౌడ్, నల్యాల లక్ష్మి, నలువాల భాగ్య, వేములవాడ లాస్య, ఎనగందుల కమలాకర్, సభ్యులు, రేకుర్తి కంటి ఆసుపత్రి టెక్నీషియన్ చింతల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020